



Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 87 | సోమవారం 25 ఆగస్టు 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



## రాష్ట్రాలను మున్సిపాలిటీలస్థాయికి దిగజార్చుతున్నారు

- దేశంలో ఫెడరల్ స్ఫూర్తికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందన్న జస్టిస్ సుదర్శన్ రెడ్డి
- రాజ్యాంగాన్ని కాపాడటమే తన బాధ్యత అని స్పష్టం
- తమిళనాడు పాలన దేశానికే ఆదర్శమంటూ ప్రశంసలు
- మద్దతు ఇచ్చిన స్టాలిన్‌కు, ఇండియా కూటమికి కృతజ్ఞతలు

**చెన్నై- సూర్యవాస్తవం, ఆగస్టు 24:**

దేశంలో ప్రస్తుతం సమాఖ్య స్ఫూర్తికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని, రాష్ట్రాల అధికారాలను హరించి వాటిని కేవలం మున్సిపాలిటీల స్థాయికి తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రతిపక్ష ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి

- మిగతా 2లో..

## త్వరలో కామన్ మ్యానిఫెస్టో

- బీహార్‌లో మంచి ఫలితాలు సాధిస్తాం
- మీడియా సమావేశంలో రాహుల్‌గాంధీ



**పాట్నా - సూర్యవాస్తవం, ఆగస్టు 24:**

ఇండియా వేదిక పార్టీలు ఐక్యంగా పనిచేస్తున్నాయని, బీహార్‌లో మంచి ఫలితాలు సాధిస్తామని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అన్నారు. త్వరలో కామన్ మ్యానిఫెస్టో విడుదల చేస్తామని తెలిపారు. ఆయన అరారియాలో ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్‌తో కలిసి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపికి సహాయం చేయడానికి, ఓట్లను చోరీ చేయడానికి ఎనికల కమిషన్ చేసిన

- మిగతా 2లో..

## భారత్‌లో పర్యటించనున్న జెలెన్ స్కీ

- కీవ్ పర్యటనలో జెలెన్ స్కీని భారత్ కు ఆహ్వానించిన మోదీ
- ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపర్చుకోవడమే లక్ష్యంగా టూర్
- ఈ ఏడాది చివరిలో రష్యా ప్రెసిడెంట్ పుతిన్ కూడా భారత్ కు రాక

**న్యూఢిల్లీ- సూర్యవాస్తవం, ఆగస్టు 24:**



ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్ స్కీ త్వరలో భారత్ లో పర్యటించనున్నట్లు సమాచారం. ఇరు దేశాల మధ్య సంబంధాలను మెరుగు పర్చుకోవడమే ఈ పర్యటన ఉద్దేశమని ఉక్రెయిన్ రాయబారి ఒలెక్సాండర్ పోలిష్ చుక్ తెలిపారు. జెలెన్ స్కీ పర్యటనకు సంబంధించి తేదీలను ఖరారు చేయడంపై కసరత్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గతేడాది ఆగస్టులో కీవ్ ను సందర్శించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీని భారత్ కు ఆహ్వానించారు. ఉక్రెయిన్‌లో శాంతి కోసం ప్రధాని మోదీ ఒత్తిడి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పలు సందర్భాల్లో ఉక్రెయిన్, రష్యా మధ్య శాంతి కోసం

- మిగతా 2లో..

# ఎరువులు పక్కదారి పట్టిస్తే డీలర్ల లైసెన్సులు రద్దు

- జిల్లాల వారీ లభ్యత, సరఫరాపై ఆరా !
- అధికారులతో సిఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్

**అమరావతి - సూర్యవాస్తవం, ఆగస్టు 24**

రాష్ట్రంలో ఎరువులు పక్కదారి పట్టిస్తే ఆయా డీలర్ల లైసెన్సులు రద్దు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఎరువుల సరఫరా విషయంలో రైతులకు ఎటువంట ఇబ్బంది లేకుండా చూసుకోవాలని సూచించారు. ఎరువుల లభ్యత, సరఫరాపై సిఎస్, డిజిపి, వ్యవసాయాధికారులు, ఇంటెలిజెన్స్, విజిలెన్స్‌శాఖ అధికారులతో హైదరాబాద్ నుంచి సిఎం టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఆదివారం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాల వారీ ఎరువుల లభ్యత ఎలా ఉంది? సరఫరా ఎలా అవుతోందనే విషయంపై ఆరా తీశారు. అవసరానికి తగ్గట్టు ఎరువులు అందుబాటులో ఉంచాలని

- మిగతా 2లో..





## సురవరం సుధాకర్ రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచేలా కేబినెట్‌లో నిర్ణయం

- సీపీఐ సీనియర్ నేత సురవరం సుధాకర్ రెడ్డి భౌతికకాయానికి సీఎం రేవంత్ నివాళి
- సిద్ధాంతాలకు కట్టుబడిన గొప్ప నేత సురవరం అని కొనియాడిన ముఖ్యమంత్రి
- సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులకు పరామర్శ
- గద్దర్, జైపాల్ రెడ్డిల మాదిరిగానే సురవరంకు సముచిత గౌరవం ఇస్తామని వెల్లడి
- మగ్దూం భవన్‌లో సీపీఐ జాతీయ నేతలతో సీఎం భేటీ, సేవలు స్మరణ

**హైదరాబాద్- సూర్యవాస్తవం, ఆగస్టు 24**

సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి భౌతికకాయానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. సిద్ధాంతం కోసం జీవితాంతం పనిచేసిన ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోయేలా

2లో



## ఇస్రో ఎయిర్ డ్రాప్ టెస్టు విజయవంతం

- గగన్ యాన్ మిషన్ లో కీలక ముందడుగు...
- పారాచూట్ ఆధారిత వేగాన్ని తగ్గించే వ్యవస్థపై ప్రయోగం
- ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డ్రాప్ టెస్ట్ (ఐఏడీటీ-01) సక్సెస్
- వ్యోమగాముల సురక్షిత ల్యాండింగ్‌కు ఈ పరీక్ష కీలకం
- ఇస్రో, డీఆర్‌డీఓ, వైమానిక, నౌకాదళాల సమన్వయంతో

- మిగతా 2లో..



## కుప్పం చేరుకున్న కృష్ణా జలాలు...

- నాడు చెప్పింది చేసి చూపించానన్న సీఎం చంద్రబాబు
- శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా కుప్పం చేరుకున్న కృష్ణా జలాలు
- నాడు చెప్పాను, నేడు చేసి చూపించానన్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- అసెంబ్లీలో చేసిన శపథం వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్న సీఎం
- పులివెందులకు కూడా నీళ్లు తెచ్చి చూపిస్తానని గతంలోనే స్పష్టం
- కుప్పంలో కృష్ణా జలాలకు టీడీపీ శ్రేణుల ఘన స్వాగతం
- కొబ్బరికాయలు కొట్టి, హారతులతో కాలువ వద్ద సంబరాలు


2లో

## బాలకృష్ణకు అంతర్జాతీయ గుర్తింపు...

- నటుడిగా 50 ఏళ్లు పూర్తి చేసుకున్న నందమూరి బాలకృష్ణ
- లండన్‌కు చెందిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు
- భారత సినీ చరిత్రలో ఇది ఒక సువర్ణాధ్యాయం అన్న చంద్రబాబు
- బాలయ్యకు అభినందనలు తెలుపుతూ ట్వీట్ చేసిన లోకేశ్
- బాలకృష్ణ నిబద్ధత, క్రమశిక్షణ స్ఫూర్తిదాయకమని కొనియాడిన నేతలు



2లో



## బంగాళాఖాతంలో నేడు అల్పపీడనం...

- ఏపీలో రానున్న మూడు రోజులు వర్షాలు
- ఉత్తరాంధ్రలో మోస్తరు నుంచి భారీ వర్షపాతం అంచనా
- మిగిలిన జిల్లాల్లో తేలికపాటి జల్లులకు అవకాశం

2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

### రాష్ట్రాలను మున్సిపాలిటీలస్థాయికి
# దిగజార్చుతున్నారు

(మొదటి పేజీ తరువాయి)

అభ్యర్థి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఉపరాష్ట్రపతిగా ఎన్నికైతే రాజ్యాంగాన్ని పరిరక్షించడమే తన ప్రథమ కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం చెన్నైలో జరిగిన ఓ సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

ఈ సందర్భంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. "దేశంలో అధికారాన్ని కేంద్రీకరించే ప్రయత్నాలు నానాటికీ పెరుగుతున్నాయి. ఇది రాజ్యాంగ మౌలిక స్వరూపానికి గొడ్డలిపెట్టు లాంటిది. జీఎస్టీ విధానంలో మార్పులు తీసుకురావడం, రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని దెబ్బతీసేలా విధానాలు రూపొందించడం వంటి చర్యలు సమాఖ్య వ్యవస్థను తీవ్రంగా బలహీనపరుస్తున్నాయి. ఈ ప్రయత్నాలు ఇలాగే కొనసాగితే, రాష్ట్రాలు తమ ప్రాముఖ్యతను కోల్పోయి కేవలం మున్సిపాలిటీలుగా మిగిలిపోయే ప్రమాదం ఉంది" అని హెచ్చరించారు. దేశమంటే రాష్ట్రాల సమాహారం అనే విషయాన్ని అందరూ గుర్తించాలని జస్టిస్ రెడ్డి నొక్కి చెప్పారు. "భారతదేశ బలం భిన్నత్వంలో ఏకత్వంలోనే ఉంది. మన రాజ్యాంగం కూడా రాష్ట్రాల ఐక్యతకే పెద్దపీట వేసింది. ఈ ప్రాథమిక సూత్రాన్ని కాపాడుకున్నప్పుడే ప్రజాస్వామ్యం మనుగడ సాగిస్తుంది" అని ఆయన అభిప్రాయపడ్డారు. సమాఖ్య హక్కుల కోసం తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ గట్టిగా పోరాడుతున్నారని ప్రశంసించారు.తన న్యాయవాద వృత్తిని గుర్తుచేసుకుంటూ, "గత 52 ఏళ్లుగా న్యాయమూర్తిగా నేను రాజ్యాంగాన్ని నిలబెట్టాను. ప్రజలు నాకు అవకాశం ఇస్తే, భవిష్యత్తులో కూడా రాజ్యాంగాన్ని కాపాడటానికి, దాని విలువలను పరిరక్షించడానికి కట్టుబడి ఉంటాను. నాపై నమ్మకం ఉంచిన ప్రజలను గానీ, రాజ్యాంగాన్ని గానీ నేను ఎప్పటికీ నిరాశపరచను" అని హామీ ఇచ్చారు. అంతకుముందు, పాలనలో తమిళనాడు దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఆయన కొనియాడారు. "ఆరోగ్యం, విద్య, సామాజిక-ఆర్థిక అభివృద్ధి వంటి రంగాల్లో తమిళనాడు అద్భుతమైన దార్శనికతతో ముందుకు సాగుతోంది. మానవాభివృద్ధిలో ఈ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా ఉంది," అని పేర్కొన్నారు. తన అభ్యర్థిత్వానికి మద్దతు తెలిపిన ముఖ్యమంత్రి స్టాలిన్‌తో పాటు ఇండియా కూటమిలోని ఇతర నేతలందరికీ ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై వారు ఉంచిన నమ్మకానికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని, రాజ్యాంగ పరిరక్షణకు తన జీవితాన్ని అంకితం చేస్తానని ఆయన పునరుద్ఘాటించారు.

### ఇస్రో ఎయిర్ డ్రాప్
# టెస్టు విజయవంతం

**నెల్లూరు - సూర్యవాస్తవం, ఆగస్టు 24**

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రతిష్ఠాత్మక గగన్‌యాన్ మిషన్ దిశగా మరో కీలక మైలురాయిని అధిగమించింది. మానవసహిత అంతరిక్ష యాత్రలో వ్యోమగాముల భద్రతకు అత్యంత ముఖ్యమైన పారాచూట్ వ్యవస్థ పనితీరును పరీక్షించేందుకు చేపట్టిన "ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డ్రాప్ టెస్ట్ (ఐఏడీటీ-01)"ను విజయవంతంగా పూర్తి చేసినట్లు ఇస్రో ప్రకటించింది. ఈ ప్రయోగం గగన్‌యాన్ మిషన్ విజయానికి చాలా కీలకమైనదిగా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అంతరిక్షం నుంచి భూమికి తిరిగి వచ్చే క్రమంలో వ్యోమగాములు ఉండే మాడ్యూల్ వేగాన్ని నియంత్రించి, దానిని సురక్షితంగా దించడం కోసం ఈ పారాచూట్ వ్యవస్థను ఉపయోగిస్తారు. ఈ వ్యవస్థ మొదటి నుంచి చివరి వరకు ఎలా పనిచేస్తుందో సమగ్రంగా నిరూపించేందుకే ఈ తాజా పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్ష ద్వారా పారాచూట్ వ్యవస్థ పనితీరును విజయవంతంగా ప్రదర్శించినట్లు ఇస్రో వర్గాలు తెలిపాయి. ఈ కీలక ప్రయోగం కేవలం ఇస్రో ఒక్కటే కాకుండా, దేశంలోని పలు ప్రముఖ రక్షణ, పరిశోధనా సంస్థల సమష్టి కృషితో సాధ్యమైంది. భారత వైమానిక దళం (%×ూఖీ%), డీఆర్‌డీఓ, భారత నౌకాదళం, ఇండియన్ కోస్ట్ గార్డ్ ఈ పరీక్షలో ఇస్రోతో కలిసి పాలుపంచుకున్నాయి. ఈ సంస్థలన్నీ సమన్వయంతో పనిచేసి ఈ క్లిష్టమైన ప్రయోగాన్ని విజయవంతం చేశాయి. గగన్‌యాన్ మిషన్ ద్వారా వ్యోమగాములను సురక్షితంగా అంతరిక్షంలోకి పంపి, తిరిగి భూమికి తీసుకురావడమే లక్ష్యంగా ఇస్రో ముందుకు సాగుతోంది. ఈ ప్రయోగ విజయం ఆ లక్ష్య సాధనలో ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలుస్తుంది.

# బాలకృష్ణకు అంతర్జాతీయ గుర్తింపు...

**- నటుడిగా 50 ఏళ్లు పూర్తి చేసుకున్న నందమూరి బాలకృష్ణ**
**- లండన్‌కు చెందిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు**
**- భారత సినీ చరిత్రలో ఇది ఒక సువర్ణాధ్యాయం అన్న చంద్రబాబు**
**- బాలయ్యకు అభినందనలు తెలుపుతూ ట్వీట్ చేసిన లోకేశ్**
**- బాలకృష్ణ నిబద్ధత, క్రమశిక్షణ స్ఫూర్తిదాయకమని కొనియాడిన నేతలు**

**అమరావతి - సూర్యవాస్తవం, ఆగస్టు 24**



ప్రముఖ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తన సినీ ప్రస్థానంలో ఒక అరుదైన మైలురాయిని చేరుకున్నారు. కథానాయకుడిగా 50 ఏళ్లు పూర్తి చేసుకున్న చారిత్రక ఘట్టానికి గుర్తుగా ఆయనకు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. లండన్‌కు చెందిన ప్రతిష్ఠాత్మక 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్' తమ గోల్డ్ ఎడిషన్‌లో బాలకృష్ణకు స్థానం కల్పించింది. ఈ అపురూప విజయానికి గాను ఆయనకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఆయనకు శుభాభినందనలు తెలిపారు. "ప్రియమైన బాలయ్యకు అభినందనలు. కథానాయకుడిగా 50 ఏళ్ల ఆయన ప్రస్థానం భారత సినీ చరిత్రలో ఒక సువర్ణాధ్యాయం. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తింపు ఆయన అసాధారణ ప్రయాణానికి నిదర్శనం" అని చంద్రబాబు పేర్కొన్నారు. తరతరాల ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్న బాలకృష్ణ అంకితభావం, పట్టుదల ఎందరికో ఆదర్శమని ఆయన కొనియాడారు. నారా లోకేష్ కూడా స్పందిస్తూ, "ప్రియమైన బాల మావయ్యకు శుభాకాంక్షలు. ఆయన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించడం మా కుటుంబానికే కాక, ప్రతి తెలుగు సినీ అభిమానికి గర్వకారణం. సినిమా పట్ల ఆయనకున్న అభిరుచి, క్రమశిక్షణ మా అందరికీ స్ఫూర్తినిస్తాయి," అని తెలిపారు. ఈ విధంగా కుటుంబ సభ్యుల నుంచి అభినందనలు వెల్లువెత్తడంతో నందమూరి అభిమానులు, తెలుగు సినీ పరిశ్రమ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

### ఎరువులు పక్కదారి పట్టిస్తే
# డీలర్ల లైసెన్సులు రద్దు

(మొదటి పేజీ తరువాయి)

సిఎం ఆదేశించారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఎంతమేర ఎరువులను సరఫరా చేస్తున్నారని అధికారులను సిఎం అడిగారు. మార్క్‌ఫెడ్ ద్వారా సుమారు 70 శాతం మేర ఎరువులు సరఫరా అయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎరువులు పక్కదారి పట్టకుండా విజిలెన్స్ అధికారులు యూరియా, ఎరువుల స్టాక్ కూడా చెక్ చేయాలని సిఎం ఆదేశించారు. వ్యవసాయేతర అవసరాలకు యూరియా తరలిపోకుండా కట్టడి చేయాలని, ఎరువుల సక్రమ వినియోగంపై రైతుల్లో అవగాహన పెంచాలని సూచించారు.

ఎరువులు, యూరియా సరఫరా విషయంలో జరిగే దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. పొరపాట్లు ఉంటే సరిచేసుకోవాలని, ఎవరైనా ఫేక్ ప్రచారాలు చేస్తుంటే అలాంటి వారిని గుర్తించి గుణపాఠం తరహాలో సమాధానం చెప్పాలని అధికారులకు సిఎం ఆదేశించారు. స్థానిక అధికారులతో జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. పరిశ్రమలు, రవాణా, విజిలెన్స్, పోలీస్, వ్యవసాయశాఖల అధికారులు, కలెక్టర్లు సమన్వయంతో రోజువారీ పరిశీలన బృందాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎక్కడైనా సమస్య వస్తే స్థానిక ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని సిఎం పేర్కొన్నారు. ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కేసులు నమోదు చేయడానికి ఎక్కడా వెనుకాడొద్దని ఆదేశించారు. ఐఎంఎఫ్ఎస్ పోర్టల్‌లో రియల్ టైమ్ ప్రాతిపదికన సమాచారం అప్‌డేట్ కావడం లేదని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. పోర్టల్‌లో సమాచారం నిరంతరం అప్‌డేట్ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అత్యధికంగా ఎరువులు అమ్ముతున్న రిటైలర్లు తరచూ కొనుగోలు చేస్తున్న వారు ఎవరైనా ఉన్నట్లు గుర్తిస్తే అలాంటి వారి విషయంలో వెంటనే దర్యాప్తు చేపట్టాలన్నారు. రైతు సేవా కేంద్రాలు, సహకార సంఘాల వద్ద సరిపడా నిల్వలు ఉండేలా చూసుకోవాలని అధికారులను సిఎం చంద్రబాబు ఆదేశించారు. బయట ప్రైవేట్ డీలర్ల కంటే ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా ఎరువుల సరఫరా ఎక్కువగా జరిగేలా చూడాలన్నారు. రిటైల్ కేంద్రాలు, పిఎసిఎస్‌ల వద్ద యూరియా, ఎరువుల కోసం రైతులు పడిగాపులు పడే పరిస్థితి రాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

### సురవరం సుధాకర్ రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచేలా
# కేబినెట్‌లో నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రివర్గంలో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని ఈ సందర్భంగా సీఎం ప్రకటించారు. నిరుపేదలు, బహుజనుల పక్షాన నిలిచిన గొప్ప నేతను కోల్పోయామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూం భవన్‌లో ఉంచిన సురవరం సుధాకర్ రెడ్డి పార్థివదేహాన్ని ముఖ్యమంత్రి సందర్శించి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న సీపీఐ జాతీయ నాయకులు డి. రాజా, కె. నారాయణ, కూనంనేని సాంబశివరావు, అజీజ్ పాషాతో మాట్లాడి సురవరం గారితో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, "సుధాకర్ రెడ్డి గారు విద్యార్థి దశ నుంచి జాతీయ రాజకీయాల వరకు ఒకే సిద్ధాంతంతో, నిరాడంబరంగా జీవించారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా, పార్లమెంట్ సభ్యుడిగా పనిచేసినా ఏనాడూ అహంకారం దరిచేరనీయలేదు. పాలమూరు బిడ్డగా బూర్గుల, జైపాల్ రెడ్డిల కోవలో ఆయన జిల్లాకు ఎంతో పేరు తెచ్చారు," అని కొనియాడారు.

సురవరం ప్రతాప రెడ్డి పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టాలని గతంలో సుధాకర్ రెడ్డి కోరగానే తక్షణమే అమలు చేశామని సీఎం గుర్తుచేశారు. "విలువలతో కూడిన నాయకులను గౌరవించుకోవడంలో మా ప్రభుత్వం ముందుంటుంది. కొండా లక్ష్మణ్ బాపూజీ, చాకలి ఐలమ్మ, గద్దర్, జైపాల్ రెడ్డిల పేర్లను చిరస్థాయిగా నిలిపాం. అదే విధంగా సుధాకర్ రెడ్డి గారిని కూడా శాశ్వతంగా గుర్తుంచుకునేలా సముచిత నిర్ణయం తీసుకుంటాం," అని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా తన సంతాప సందేశాన్ని పంపినట్లు సీఎం తెలిపారు.

# త్వరలో కామన్ మ్యానిఫెస్టో

(మొదటి పేజీ తరువాయి)

ప్రయత్నమే బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్‌ఐఆర్) అని అన్నారు. ఓట్లు చోరీ చేసేందుకు అనుమతించ బోమని అన్నారు. 'ఓటర్ అధికార్ యాత్ర'లో భాగంగా బీహార్‌లో పర్యటిస్తున్న ఆయన ఎనిమిదో రోజు పూర్ణియా జిల్లా అరారియాలో తేజస్వీ యాదవ్‌తో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. వీధుల్లో మోటారు సైకిల్ నడిపారు. వీరిని చూడటానికి జనం భారీ సంఖ్యలో బారులు తీరారు. ఈ నెల 17న రాహుల్ గాంధీ ప్రారంభించిన ఓటర్ అధికార్ యాత్ర, 1300 కిలోమీటర్ల మేర కొనసాగనుంది. ఈ యాత్ర 16 రోజుల పాటు 20 జిల్లాలకు పైగా కొనసాగి, సెప్టెంబర్ 1న పాట్నాలో నిర్వహించే భారీ సభతో ముగియనుంది.

# భారత్‌లో పర్యటించనున్న జెలెన్ స్కీ

(మొదటి పేజీ తరువాయి)

వాదిస్తూ "ఇది యుద్ధ యుగం కాదు" అని నొక్కి చెప్పారు. పుతిన్, జెలెన్ స్కీలతో టెలిఫోన్ సంభాషణలు జరిపారు. భారతదేశం రెండు దేశాల మధ్య శాంతిని కోరుకుంటుందని వెల్లడించారు. మరోవైపు, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా ఈ ఏడాది చివరలో భారత్ కు రానున్నారు.

### బంగాళాఖాతంలో
# నేడు అల్పపీడనం...

**- ఏపీలో రానున్న మూడు రోజులు వర్షాలు**
**- ఉత్తరాంధ్రలో మోస్తరు నుంచి భారీ వర్షపాతం అంచనా**
**- మిగిలిన జిల్లాల్లో తేలికపాటి జల్లులకు అవకాశం**

**అమరావతి - సూర్యవాస్తవం, ఆగస్టు 24**

ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురవనున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) వెల్లడించింది. వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఏపీఎస్‌డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపిన వివరాల ప్రకారం, సోమవారం (ఆగస్టు 25) ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలకు సమీపంలో వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీని కారణంగా రాబోయే మూడు రోజుల పాటు రాష్ట్ర వాతావరణంలో మార్పులు చోటుచేసుకోనున్నాయి. ముఖ్యంగా ఉత్తరాంధ్రలోని జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు పడతాయని వివరించారు. సోమవారం రోజున శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని ప్రఖర్ జైన్ తెలిపారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

### కుప్పం చేరుకున్న
# కృష్ణా జలాలు...


**- నాడు చెప్పింది చేసి చూపించానన్న సీఎం చంద్రబాబు**
**- శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా కుప్పం చేరుకున్న కృష్ణా జలాలు**
**- నాడు చెప్పాను, నేడు చేసి చూపించానన్న ముఖ్యమంత్రి చంద్రబాబు**
**- అసెంబ్లీలో చేసిన శపథం వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్న సీఎం**
**- పులివెందులకు కూడా నీళ్లు తెచ్చి చూపిస్తానని గతంలోనే స్పష్టం**
**- కుప్పంలో కృష్ణా జలాలకు టీడీపీ శ్రేణుల ఘన స్వాగతం**
**- కొబ్బరికాయలు కొట్టి, హారతులతో కాలువ వద్ద సంబరాలు**

**అమరావతి - సూర్యవాస్తవం, ఆగస్టు 24**

ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పం ప్రజల దశాబ్దాల కల నెరవేరింది. శ్రీశైలం జలాశయం నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా తరలించిన కృష్ణా జలాలు ఎట్టకేలకు కుప్పం గడ్డను తాకాయి. ఈ చారిత్రక ఘట్టంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "నాడు చెప్పాను... నేడు చేసి చూపించాను" అంటూ ఆయన హర్షం వ్యక్తం చేశారు. గతంలో తాను అసెంబ్లీ వేదికగా చేసిన శపథాన్ని ఈ సందర్భంగా చంద్రబాబు గుర్తుచేశారు. మదనపల్లె, పలమనేరుతో పాటు కుప్పానికి కచ్చితంగా నీళ్లు తీసుకువస్తానని, పులివెందులకు కూడా నీళ్లు ఇచ్చి చూపిస్తానని తాను అన్న మాటల పాత వీడియోను ఆయన తన పోస్టుకు జతచేశారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. మరోవైపు, తమ ప్రాంతానికి కృష్ణా జలాలు చేరడంతో స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు, కూటమి నేతలు ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. కాలువ వద్దకు పెద్ద ఎత్తున చేరుకుని పండగ వాతావరణం సృష్టించారు. కృష్ణా జలాలకు కొబ్బరికాయలు కొట్టి, హారతులు పట్టి ఘనంగా స్వాగతం పలికారు. పార్ ెజెండాలు చేతబూని కాలువలో దిగి తమ ఆనందాన్ని నినాదాల రూపంలో వ్యక్తం చేశారు. ఈ భావోద్వేగ క్షణాలకు సంబంధించిన వీడియోలను తెలుగుదేశం పార్టీ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో పంచుకుంది.

## సంపాదకీయం

### అరెస్ట్ అయితే ఔట్...





**కే**ంద్ర ప్రభుత్వం తెచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో దుమారం రేపింది. ప్రతిపక్ష పార్టీలు రభస చేశాయి. నేరారోపణలు ఎదుర్కొంటూ రిమాండ్‌లో ఉండేవారు.. రాజ్యాం గబద్ధమైన పదవుల్లో కొనసాగరాదంటూ ప్రభుత్వం కొత్త బిల్లును పార్లమెంట్ ముందుకు తెచ్చింది. పోలీసు కస్టడీలోకి వెళ్లిన 30రోజుల్లో రాజీనామా చేయాలి.. లేకపోతే పదవి దానంతట అదే పోతుందన్నది కొత్త బిల్లు ముఖ్యాంశముఖ్య ఉద్దేశ్యం ఏంటంటే.. తీవ్రమైన అవినీతి, ఇతర నేరారోపణలు ఎదుర్కొంటున్న వారు.. 30 రోజుల కంటే ఎక్కువగా పోలీసు కస్టడీలో ఉంటే ఆ మరుసటి రోజు నుంచి వారి పదవి ఉండదు. ప్రధాని, ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులందరికీ ఈ నిబంధన వర్తింపచేయనున్నారు. 5 ఏళ్ల కంటే ఎక్కువ శిక్ష పడే నేరారోణలు కలిగిన వారందరికీ ఈ నిబంధన వర్తింప చేయాలని కొత్త బిల్లులో ప్రతిపాదించారు. దీనిపైనే ఇండియా అలయెన్స్ తీవ్ర నిరసన వ్యక్తం చేస్తోంది.నేరం నిరూపణ అయ్యే వరకూ ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రతివ్యక్తి అనుమానితుడు మాత్రమే.. నేరారోణపులు ఎదుర్కొంటున్న వ్యక్తికి నిస్పాక్షికమైన విచారణ కోరుకునే హక్కు రాజ్యాంగం కల్పించింది. ఆర్టికల్ 21లో ఇది ఓ భాగం. కానీ ఈ కొత్త బిల్లు నేరు నిరూపణ, శిక్ష లేకండానే... కేవలం ఆరోపణల మీద ఆరెస్ట్ అయినా సరే... పదవి వదులు కోవాలని కొత్త బిల్లులో ప్రతిపాదించారు. ఆర్టికల్ 21 ప్రతివ్యక్తికీ జీవించే హక్కును, వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని కల్పించింది. నేరారోపణలు ఉంటే ఫెయిర్ ట్రయల్ పొందే హక్కు కల్పించింది. అలాగే ఆర్టికల్ 14 చట్టం ముందు ప్రతి ఒక్కరూ సమానులే అని చెబుతోంది. ఇప్పుడు తీసుకొచ్చే రాజ్యాంగ సవరణతో ఈ ప్రాథమిక హక్కులకే భంగం కలుగుతుందని ప్రతిపక్షాలు చెబు తున్నాయి. ప్రస్తుతం ఉన్న వెసులుబాటు.. అనేక సమస్యలకు కారణం అవుతోందని కేంద్రం చెబుతోంది.ఓ ముఖ్యమంత్రి జైలుకు వెళితే.. పరిపాలన అంతా కుంటుపడుతుంది. సీఎం జైలులో ఉంటే కేబినెట్ సమావేశాలు జరగవు. ఫైళ్లు ముందుకెళ్లవు. శాసన వ్యవహారాల్లో పాల్గొనలేరు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు మంత్రివర్గం సమిష్టిగా బాధ్యత వహిస్తుందని రాజ్యాంగం చెబుతోంది. కానీ ఇలా నిర్బంధంలో ఉన్న వారు చేసే పనులు రాజ్యాంగ పరంగా నైతికమేనా అన్న ప్రశ్న తలెత్తుతుంది.తీవ్రమైన నేరాలు, అవినీతి ఆరోపణలు ఎదుర్కొనే వారు అత్యున్నత పదవుల్లో కొనసాగితే.. అవన్నీ సాధారణం అనే భావన పెరిగిపోతుంది. ఇంతటి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు వ్యవస్థలను నడిపిస్తుంటే ప్రజల్లో ఆ సంస్థల పట్ల విశ్వాసం దెబ్బతింటుంది.ఇప్పుడు ప్రతిపాదించిన బిల్లు చట్టరూపంలోకి వస్తే..నెలరోజులకు మించి కళంకితులు పదవుల్లో ఉండే అవకాశం లేదు. దీనిని రాష్ట్ర, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులతో పాటు.. ప్రధానిని కూడా దీని పరిధిలోకి తీసుకొచ్చామని కేంద్రం చెబుతోంది.రాజ్యంగంలోని ఆర్టికల్ 75 ప్రధాని నియామకం, మంత్రిమండలి గురించి చెబుతుంది. మంత్రిమండలిలో అనర్హతపై చర్చించే ఆర్టికల్ 75, క్లాజ్ 5కు ఇప్పుడు సవరణ ప్రతిపాదించారు. దీని ప్రకారం క్లాజ్ 5ం చేరుస్తారు. ప్రతిపాదిత బిల్లులో కేంద్రమంత్రి వర్గంలోని సభ్యుడు నేరారోపణల కారణంగా ఐదు సంవత్సరాలకు పైబడి శిక్ష పడే నేరంలో నెలరోజుల పాటు కస్టడీలో ఉంటే... ప్రధాని సిఫారసుతో అతన్ని 31 వరోజు రాష్ట్రపతి తొలగించాలి.ఇదే పరిణామాలతో ప్రధానమంత్రి ఐదేళ్ల పైబడి శిక్ష పడే నేరారోణపణలు ఎదుర్కొంటూ.. 30 రోజులకు పైబడి కస్టడీలో ఉన్నట్లైతే.. ఆయన స్వయంగా రాజీనామా చేయాలి. లేనిపక్షంలో 31వరోజు నుంచే ప్రధాని పదవి ఉండదు.ఆర్టికల్ 164 లోని ముఖ్యమంత్రి నియామకానికి సంబంధించి 4వ క్లాజ్‌కు అదనంగా 4ం జతపరుస్తారు. దీని ప్రకారం ఆరోపణలు ఎదుర్కొంటున్న రాష్ట్ర మంత్రులను ముఖ్యమంత్రి సిఫారసుతో గవర్నర్ 31వ రోజు తొలగిస్తారు. అలాగే ఈ విధమైన ఆరోపణలు ఎదుర్కొనే ముఖ్యమంత్రి నెలరోజులలోపు రాజీనామా చేయకపోతే.. 31వ రోజు నుంచి సీఎంగా పరిగణించరు.ఇదే పద్ధతిలో ఆర్టికల్ 239ంంలో 5వ క్లాజ్ ను సవరించి ఢిల్లీ ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రులకు ఇదే వర్తింపచేస్తారుచూడటానికి నైతిక స్ఫూర్తితో .. పాలనా వ్యవస్థలను సంస్కరించేందుకు తెచ్చిన గొప్ప సంస్కరణగా ఇది కనబడుతున్నా.. దీనిపై పెద్ద రాజకీయం ఉందని ప్రతిపక్షాలు అంటున్నాయి. అందుకే వాళ్లు ఆ స్థాయిలో దీనిని వ్యతిరేకించారు. ప్రతిపక్షాల గొడవకు పార్లమెంట్‌లోకి మార్షల్స్ రావలసి వచ్చింది. బిల్లును చించి... హోంమంత్రిపైకి కూడా విసిరారు. ఇంత తీవ్రంగా వాళ్లు వ్యతిరేకించడానికి కారణం కూడా ఉంది.ఇది ప్రతిపక్షాలను అణగదొక్కే ఉద్దేశ్యంతో తెచ్చిన బిల్లు అని ఆ పార్టీలు అంటున్నాయి. అధికార పక్షం ఏదైనా రాష్ట్రంలో అధికారంలోకి రావడం సాధ్యం కాకపోతే.. ఈ చట్టాన్ని అడ్డుపెట్టుకుని సీఎంలను మార్చేస్తారు.అరెస్టు అయిన వారు నేరస్తులు కాదు. నేరం నిరూపితం అయ్యే వరకూ నిందితులు అంతా నిర్దోషులే. 30రోజుల్లో ఆటోమేటిక్‌గా పదవి నుంచి తొలగించడం అంటే నేరం చేయకుండానే శిక్ష విధించడంకేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీ పేట్రేగిపోతాయి. ఇప్పటికే.. వాటిని రాజకీయాల కోసం వాడుతున్నారన్న విమర్శలున్నాయి. ఈ చట్టం వస్తే.. అది మరో రాజకీయ అస్త్రం అవుతుంది.ప్రభుత్వాలను అస్థిర పరచడం కోసం.. ఈ ఏజన్సీల ద్వారా అరెస్టులు చేసి రిమాండ్‌కు పంపుతారు. ఈలోగా ప్రభుత్వాలను మార్చేస్తారు.

### బీసీల రిజర్వేషన్

# పితామహుడు బీపీ మండల్

**వె**నుకబడిన వర్గాల నుండి ఒక చదుకున్న వ్యక్తి తను వచ్చిన సమాజం అభివృద్ధి గురించి నిస్వార్థంగా , నిబద్ధతతో పని చేస్తే ఎలాంటి మార్పు ఉంటుందో ఉదాహరణే బీపీ. మండల్ జీవితం. బిందేశ్వరి ప్రసాద్ మండల్ భారతదేశ పార్లమెంటు సభ్యుడు, మాజీ బీహార్ ముఖ్యమంత్రి ,సంఘ సంస్కర్త. అతను రెండవ వెనుకబడిన తరగతుల కమిషన్ (మండల్ కమిషన్ గా సుపరిచితం) కు చైర్మన్ గా వ్యవహరించాడు. అతను ఉత్తర బీహార్ లోణి సహర్సా లో అత్యంత ధనుకులైన యాదవ్ జమిందారీ (భూస్వాములు) కుటుంబంలో నన్మించాడు. కమిషన్ భారతదేశం లోని ప్రజలలో ఒక భాగాన్ని "అదర్ బేక్ వర్డ్ క్లాసెస్"(ఓబీసీ) (ఇతర వెనుకబడిన కులాలు)గా నివేదిక ప్రకారం నివేది ంచింది. భారతీయ రాజకీయాల్లో తక్కువగా ఉన్న, బలహీన వర్గాల కోసం పాలసీపై తీవ్రమైన చర్చ ప్రారంభమైంది. బి.పి. మండల్ ( బిందేశ్వరి ప్రసాద్ మండల్ ) బీహార్ లోని బనారస్ లోని ఒక యాదవ్ కుటుంబంలో 1918 ఆగస్టు 25న జన్మించాడు.. మాధేపురా జిల్లాలోని మోరో గ్రామంలో పెరిగాడు. మండేపురంలో మండల్ తన ప్రాథమిక విద్యని , దర్భాంగాలో ఉన్నత పాఠశాల విద్యని పూర్తి చేసాడు. 1930 లలో పాట్నా కాలేజీలో ఇంటర్మీడియేట్ పూర్తి చేసిండు. ఆ తరువాత పై చదువులకై అతను ప్రెసిడెన్సీ కళాశాల కలకత్తాలో చేరిండు. దుర దృష్టవశాత్తు, ఇంట్లో కొన్ని అనివార్యమైన పరిస్థితుల కారణంగా, అతను తన చదువుని విడిచిపెట్టవలసి వచ్చింది.మండల్ తన 23 వయేటా జిల్లా కౌన్సిల్ కి ఎన్నికయ్యాడు. 1945-51 మధ్య కాలములో మాధేపుర డివిజన్ లో జీతం తీసుకోకుండానే జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ గా పని చేసాడు. అతని రాజకీయ జీవితం భారత జాతీయ కాంగ్రెస్ తో మొదలైంది. 1952 లో మొదటిసారి బీహార్ అసెంబ్లీకి శాసనసభ్యునిగా ఎన్నికయ్యాడు. అధికార పక్షములో ఉండి బీహార్ లోని బలహీనవర్గ కుర్మీలపై అగ్రవర్ణ రాజుపుత్రులు దాడి చేయడాన్ని నిరసించాడు. 1965 లో తన నియోజకవర్గంలో భాగంగా ఉన్న గ్రామమైన పామాలో మైనారిటీలు, దళితులపై పోలీసులు చేస్తున్న అత్యాచారాలపై మాట్లాడాలని కోరుకున్నప్పుడు అధికార పక్షములో ఉండి ఈ అంశంపై మాట్లాడ కూడదని ముఖ్యమంత్రి



ఆదేశిస్తే తన మనస్సాక్షిని చంపుకోలేక తను నమ్మిన విలువల కోసం ప్రతిపక్ష పాత్ర నిర్వహించడానికి సిద్ధమై సంయుక్త సోషలిస్ట్ పార్టీ (ఎస్.ఎస్.పి) లో చేరాడు. ఎస్.ఎస్.పి రాష్ట్ర పార్లమెంటరీ బోర్డు ఛైర్మన్ గా నియ మించబడ్డాడు. 1967 లో జరిగిన ఎన్నికలలో ఎస్.ఎస్.పి అభ్యర్థుల ఎంపికపై ఆయన చేసిన కృషి, ఆయన ప్రచారం వల్ల 1962 లో కేవలం 7 సీట్లు కల ఆ పార్టీకి 1967 లో 69 సీట్లు వచ్చాయి.

బీహార్లో మొట్టమొదటి కాంగ్రెస్ యేతర ప్రభుత్వం ఏర్పడింది. అతను పార్లమెంటు సభ్యుడు అయినప్పటికీ మంత్రివర్గంలో చేర్చారు. ఆరోగ్య శాఖ మంత్రిగా పని చేసాడు. కానీ పార్టీలో, ప్రభుత్వములో కొన్ని విబేధాలు రావడముతో కాంగ్రెస్ పార్టీ బయటి నుండి మద్దతు ఇవ్వడంతో 1968 ఫిబ్రవరి 1 న అతను బీహార్ రాష్ట్ర రెండవ బీసీ ముఖ్యమంత్రిగా పదవీ భాధ్యతలు స్వీకరించాడు. కాంగ్రెస్ పార్టీ మద్దతు తీసుకుంటూనే రాజీ పడకుండా రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతల అవినీతిపై అయ్యర్ కమిషన్ వేసి విచారణ చేయించాడు. ఆ కమిషన్ నివేదికను బయలుపరచకుండా అప్పటి ప్రధాని ఇందిరాగాంధి స్వయంగా ఒత్తిడి తీసుకవచ్చింది. ప్రధానితో అతను మాట్లాడడానికి నిరాకరించడముతో ప్రభుత్వముపై అవిశ్వాస తీర్మానం పెట్టి నెగ్గడంతో 30 రోజులకే మండల్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. అతను తరచూ తన మంత్రులకు, "ఓట్లను సంపాదించడానికి కులపరమైన విజ్ఞప్తి సహించవచ్చు కానీ ప్రభుత్వాల నిర్ణయాలల్లో ఏ కులతత్వాన్ని సహించవద్దు" అని చెప్పే మండల్ తన ప్రభుత్వములో పరిపాలనలో ఎక్కడ కులతత్వాన్ని ప్రదర్శించకుండా పాలించాడు.1967 మార్చి 5న అతను సోషిత్ దళ్ (అణగారిన ప్రజల పార్టీ ) ని స్థాపించాడు. 1967 నుండి 1970 వరకు లోక్‌సభ సభ్యునిగా ఉన్నాడు. 1972 లో శాసనసభకు తిరిగి ఎన్నికయ్యాడు. 1972 లో అప్పటి బీహార్ ముఖ్య మంత్రి పాండే మిథిలా యూనివర్సిటీ పేరుతో అందులో కింది ఉద్యోగి నుండి వైస్ ఛాన్సలర్ వరకు ఒకే కులం వారితో నిం పాలనే ప్రయత్నాలని వ్యతిరేకించాడు. ఆ తర్వాత 1974 లో శాసన సభ సభ్యత్వానికి రాజీనామా చేసి జయప్రకాష్ నారాయణ నేతృత్వములో నడుస్తున్న అవినీతి వ్యతిరేక ఉద్యమములో పాల్గొన్నాడు. 1977 లో జనతా పార్టీ తరపున లోక్ సభకి ఎన్నికై 1979 వరకు కొనసాగాడు. ఎమర్జెన్సీ తర్వాత ఏర్పాటైన జనతా ప్రభుత్వం ఇందిరాగాంధీని డిబార్ చేయాలని అధికార పార్టీ సభ్యులు తెచ్చిన తీర్మానాన్ని మండల్ వ్యతిరేకించాడు. మండల్ తన రాజకీయ జీవితంలో సోషలిస్ట్ రాజకీయాల ఆలోచనపరుడిగా పని చేసాడు.మండల్ కమిషన్ 1978 డిసెంబరులో మొరార్జీ దేశాయ్ ఐదుగురు సభ్యులు గల పౌర హక్కుల కమిషన్ వేసాడు దీనిని మండల్ చర్మన్ గా వ్యవహరించాడు. అతని కమిషన్ నివేదిక 1980 డిసెంబర్ 31 లో పూర్తయింది. అన్ని ప్రభుత్వ, విద్యా సంస్థలలో ఇతర వెనుకబడిన తరగతుల (ఒ.బి.సి) అభ్యర్థులకు రిజర్వు సీట్లను ఒక నిష్పత్తి ప్రకారం కేటాయించాలని సిఫారసు చేసాడు. కమిషన్ నివేదిక ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ పరిశీలనలోకి వచ్చింది. కానీ అమలు జరగలేదు. ఒక దశాబ్దం తరువాత ప్రధానమంత్రి విశ్వనాధ్ ప్రతాప్ సింగ్ ఈ సిఫార్సులను ఆమోదించాడు.వ్యక్తిగత జీవితం అతను 1982 ఏప్రిల్ 13 న మరణించాడు. అతని భార్య సీతా మండల్. వారికి ఐదుగురు కుమారులు ఉన్నారు. వారు రవీంద్రనాథ్ యాదవ్, సచీంద్రనాథ్ యాదవ్, మణీందర్ కుమార్ మండల్, గిరీంద్రనాథ్ మండల్, జ్యోతీంద్రనాథ్ యాదవ్. అతనికి రేనూ సింగ్, వీణా మండల్ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.భారత ప్రభుత్వం 2001లో అతని గౌరవార్థం ఒక పోస్టల్ స్టాంపును విడుదలచేసింది. 2007లో స్థాపించబడిన ఒక కళాశాలలు "బి.పి.మండల్ ఇంజనీరింగ్ కళాశాల" అని నామకరణం చేసారు.

# డిసెంబర్ లో గగన్ యాన్

**నెల్లూరు -సూర్య వాస్తవం:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో మరో కీలక ప్రయోగాన్ని రెడీ అవుతోంది. మరో మైలు రాయిని అధిగమి ంచేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు సిద్ధమ వుతున్నారు. మిషన్ గగన్‌యాన్‌కు సంబంధించి ఇస్రో పెద్ద అప్‌డేట్ ఇచ్చింది. ఈ ఏడాది డిసెంబర్‌లో గగన్‌యాన్-జి1ని ప్రయోగించనున్నట్లు ఇస్రో చీఫ్ వి. నారాయణన్ తెలిపారు.నాలుగు నెలల్లో ఈ రంగంలో అనేక విజయాలు సాధించామని నారాయణన్ అన్నారు. అటువంటి పరిస్థితిలో, ఈ ఏడాది చివరిలో, బహుశా డిసెంబర్‌లో మొదటి మానవరహిత మిషన్ జి1ను ప్రయోగించనున్నారు. అర్ధ-మానవుడిలా కనిపించే వ్యోమిత్ర కూడా అందులో ఎగురుతారని ఆయన అన్నారు. భారత్ పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో గగన్‌యాన్ ప్రయోగానికి శ్రీకారం చుడుతున్నట్లు ఇస్రో ఛైర్మన్ ప్రకటించారు. విజయవంతమైన ఆక్సియం-4 మిషన్ నుండి ఇటీవలే తిరిగి వచ్చిన శు భఅన్షు శుక్లా, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం అనుభవం భారతదేశ సొంత గగన్‌యాన్ మిషన్‌కు చాలా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.గగన్‌యాన్‌కు సంబంధించిన అనేక ప్రయోగాత్మక ప్రయోగాలను చేపట్టి విజయం సాధించింది. అందులో భాగంగానే అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపే దిశలో ఇస్రో మరో అడుగు




ముందుకు వేస్తోంది .ఈ నేపథ్యంలోనే గగన్‌యాన్ ఉ1 ప్రయోగాత్మక రాకెట్ ప్రయోగాన్ని 2025 చివరి మాసంలో తిరుపతి జిల్లా సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోట నుండి ఉ1 రాకెట్ ప్రయోగాన్ని చేపట్టేందుకు సన్నాహాలు సిద్ధం చేస్తోంది. అదేవిధంగా ఈ గగన్ యాన్ రాకెట్ ప్రయోగానికి సంబంధించి గగన్‌యాన్ ఉ1, గగన్‌యాన్ ఉ2, గగన్‌యాన్ ఉ3 లాంటి రాకెట్ ప్రయోగాలను కూడా 2026లో చేపట్టేందుకు ఇస్రో ఒక ప్రణాళికలను సిద్ధం చేస్తోంది.అలాగే 2027 వ సంవత్సరంలో గగన్‌యాన్ భారత్ తొలి మ్యాన్ మిషన్ ప్రయోగానికి సిద్ధమవుతున్నారు. ఒక రోబోను తయారుచేసి ఈ రాకెట్ ప్రయోగంలో అమర్చి అంతరిక్షంలో పంపేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారు. అంతరిక్షంలోకి మానవులను పంపే ముందుగా ఈ రోబోను పంపి అక్కడ వివిధ పరిశోధనలు చేసి, ఆ సమాచారాన్ని శాస్త్రవేత్తలకు అందజేస్తుంది. అంతరిక్షంలోకి పంపిన రోబో హిందీ, ఇంగ్లీష్ భాషలలో పరిశోధనలు చేసిన సమాచారాన్ని శాస్త్రవేత్తలకు అందిస్తుంది. అంతరిక్షంలోకి వెళ్ళాక అక్కడ వ్యోమగాములు ఎలాంటి వాతావరణ పరిస్థితులను తట్టుకునే వీలు ఉంటుందన్న అంశాలపై కూడా ఈ రోబో అధ్యయనం చేసి శాస్త్రవేత్తలకు తెలియజేస్తుంది. గగన్‌యాన్ ప్రధాన ప్రయోగానికి ముందుగా అంటే 2027 లో రాకెట్ ప్రయోగంలో రోబోను అమర్చి ప్రయోగాన్ని చేపట్టేందుకు ఇస్రో శ్రీకారం చుట్టింది. మ్యాన్ మిషన్ సక్సెస్ చేయడం అంటే భూమి నుంచి అంతరిక్షంలోకి వాహక నౌక వెళ్లడమే కాదు.. అంతరిక్షంలో పరిశోధనలు పూర్తి చేసుకున్న తర్వాత తిరిగి భూమి మీదకు క్షేమంగా రావడమే ప్రయోగం పూర్తి విజయంగా చూడాల్సి ఉంటుంది.ఇందుకోసమే ఇస్రో పూర్తి స్వదేశీ టెక్నాలజీతో గగన్‌యాన్ మిషన్ చేపడుతున్న సందర్భంలో ప్రతి దశను సొంతంగా ప్రయోగాత్మక ప్రయోగాలు చేపట్టి అన్ని రకాలుగా పరీక్షలు చేపడుతోంది. అంతరిక్ష నుంచి భూమికి తిరిగి వచ్చేటప్పుడు వ్యోమగామిలు ప్రయాణించే క్యాప్సిల్ క్షేమంగా భూమి మీదకు తీసుకురావడం కూడా అత్యంత కీలకం.. కాబట్టి ప్రయోగాన్ని చేపట్టి భూమి నుంచి అంతరిక్షంలోకి వెళ్లడం మొదలు పరిశోధన పూర్తయ్యాక తిరిగి భూమి మీదకు క్షేమంగా వచ్చేవరకు అన్ని దశలను ఎప్పటికప్పుడు విజయవంతంగా పరీక్షలు చేపడుతోంది ఇస్రో.

# ఏపీలో జాలీ ట్రావెలింగ్

**తిరుపతి-సూర్య వాస్తవం:** ఏపీ ప్రభుత్వం పర్యాటక రంగంపై ఫుల్ ఫోకస్ పెట్టింది. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత మెరుగు పరచాలని భావిస్తోంది. అందులో భాగంగా రాష్ట్రంలో కొత్తగా మూడు మినీ ఎయిర్పోర్టులను తీసుకురావాలని నిర్ణయించింది. హెలికాప్టర్ పర్యాటకాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి హెలికాప్టర్ సేవలు అందించడానికి ఏజెన్సీలను ఆహ్వానిస్తోంది. హైదరాబాద్, విజయవాడ, అరకు ప్రాంతాల మధ్య ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. త్వరలో హెలికాప్టర్ పర్యాటకం నిరంతరం అందుబాటులో ఉండేలా ఏపీ ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. నిరంతరం హెలికాప్టర్లు అందుబాటులో ఉంటాయి. పర్యాటక ప్రాంతాలను ఆకాశమార్గంలో చూసే అరుదైన అవకాశం కల్పించనున్నారు.రాష్ట్రంలో హెలిక్యాప్టర్ టూరిజం అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం మూడు ప్రాంతాల నుంచి హెలికాప్టర్లను నడపడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఆసక్తి కలిగిన ప్రైవేట్ ఏజెన్సీ ల నుంచి దరఖాస్తులను స్వీకరించనుంది. వచ్చిన దరఖాస్తులను




పరిశీలించి.. ఎక్కడ హెలిప్యాడ్లను ఏర్పాటు చెయ్యాలో ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోనుంది. ప్రస్తుతం హెలికాప్టర్ ద్వారా పర్యాటకులకు జాలి రైడ్ కొన్ని సందర్భాల్లో మాత్రమే అందుబాటులో ఉంటోంది. ఇకనుంచి అలా కాకుండా నిరంతరాయంగా సేవలందిలా చూడాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా తెలుస్తోంది. ప్రస్తుతం విశాఖపట్నం, మచిలీపట్నం, అరకు ఉత్సవాల్లో ప్రైవేట్ వీటిని నిర్వహించాయి. అక్కడ సక్సెస్ ఫుల్ గా కనిపించడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా చేస్తోంది.ప్రధానంగా పర్యాటక ప్రాంతాలను కలుపుతూ హెలిక్యాప్టర్లను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం చూస్తోంది. విజయవాడ నుంచి శ్రీశైలం, హైదరాబాద్ నుంచి శ్రీశైలం, అరకు నుంచి విశాఖ మధ్య హెలికాప్టర్ సేవలను నడపాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ప్రతిరోజు విజయవాడ, హైదరాబాదు నుంచి భక్తులు శ్రీశైలం వెళ్తుంటారు. వారికోసం రెండు వైపులా హెలిక్యాప్టర్ సేవలు తీసుకొస్తే గిరాకీ ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ రూట్లో హెలికాప్టర్ సేవలు మొదలుపెడితే మంచి స్పందన వస్తుందని భావిస్తున్నారు.మరోవైపు విశాఖ జిల్లాలో మన్య ప్రాంతంలో మినీ ఎయిర్ పోర్టులు ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తోంది ఏపీ ప్రభుత్వం. చిన్న చిన్న విమానాలతో పాటు హెలికాప్టర్లు ల్యాండ్ అయ్యే విధంగా వీటిని నిర్మించాలన్నది ప్రభుత్వ ప్రణాళిక. హెలికాప్టర్ టూరిజం ప్రోత్సహించే దిశగా విశాఖ, అరకు తో పాటు విజయవాడ, శ్రీశైలంలో వీటిని ఏర్పాటు చేయాలన్న ఆలోచన చేస్తోంది. సాధారణ విమానాశ్రయాల్లో ఉండే సౌకర్యాలు ఇక్కడ ఉండనున్నాయి. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న హెలిక్యాప్టర్ టూరిజం అనుగుణంగానే ఇక్కడ జాలీ ట్రావెలింగ్ కు ప్రభుత్వం యోచన చేస్తోంది.

# గ్రామాల్లో కులవివక్ష చూపించకండి: పరిటాల శ్రీరామ్





**రాప్తాడు –సూర్య వాస్తవం, ఆగస్టు 24:** కుల వివక్షపై పోరాటం మా ఇంటి నుంచే ప్రారంభమైందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు.రాప్తాడు మండల పరిధిలోని బండమీదపల్లి గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్య క్రమం పండుగ వాతావరణంలో నిర్వహించారు.ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా హిందూపురం ఎంపీ బి.కే.పార్థసారథి రాప్తాడు ఎమ్మెల్యే ప్రతాప్ సునీత ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ హాజరయ్యారు. గ్రామా నికి వచ్చిన నేతలకు గ్రామస్థులు పూలమాలలు బొకేలతో ఘన స్వాగతం పలికారు.పూల వర్షం మధ్య ఊరేగింపు నిర్వహించారు.అనంతరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే సునీత పార్థసారథి పరిటాల శ్రీరామ్ ఆవిష్కరించారు.ఈ సంధర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ కేవలం ఒక్క కులానికి మతానికి చెందిన వాడు కాదు అని తెలిపారు. ఆ రోజుల్లో దళితులు చదువుకోవడం అంటే చాలా కష్టంగా ఉండేది.కానీ అలాంటి రోజుల్లో ఎన్నో డిగ్రీలు చదివి ఆర్థిక శాఖ మంత్రి అయ్యారన్నారు. అంతే కాకుండా ఎంతో విలువైన రాజ్యాంగాన్ని మనకు అందించారన్నారు. అప్పట్లో మా గ్రామంలో దళితులు నీరు తాగాలంటే బావిలోకి దిగనిచ్చే వాళ్ళు కాదు. దీనిని తొలిసారిగా వ్యతిరేకించింది తన మామ పరిటాల శ్రీరాములు అని గుర్తు చేశారు. మా కుటుంబానికి కులం లేదు మతం లేదన్నారు. మేము ఇప్పటికీ ఎవరు వచ్చినా మా టేబుల్ పై అంతా కలిసి భోజనం చేస్తామన్నారు.కానీ ఇప్పటికీ చాలా చోట్ల దళితులు బీసీలు అంటూ వేరుగా చూస్తున్నారు .ఇది సరైన పద్ధతి కాదన్నారు. మన గ్రామాల్లోని ఓసీలు బీసీలు కుల వివక్షను చూపించకుండా ఎస్సీలతో కలిసిమెలిసి ఉండాలి అని అన్నారు.రాజకీయాలు పక్కన పెట్టి మనుషులంతా ఒక్కటే అనేది గుర్తించాలన్నారు. అట్టడుగు వర్గాల వాళ్ళు బాగుండాలని అంబేద్కర్ తపించారని అన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఎన్నో కష్టాల్లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చారన్నారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ గ్రామంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ ఒక ఆలయం ప్రారంభోత్సవంతో సమానంగా ఘనంగా నిర్వహించారన్నారు. అంబేద్కర్ విగ్రహంలో ఉన్న గంభీరమైన చూపు వెనుక ఎన్నో బాధలు ఉన్నాయన్నారు. అంటరానితనం రాజ్యమేలుతున్న సమయంలో ఆయన లండన్ లో 32 డిగ్రీలు చేశారన్నారు. మన దేశానికి వచ్చిన తర్వాత ఒక ఉద్యోగిగా కూడా ఆయన వివక్ష ఎదుర్కొన్నారన్నారు. అలాంటి సమయంలో నోరు లేని వారి కోసం ఒక పత్రికను కూడా స్థాపించారన్నారు.అందుకే మన చదువు సమాజం కోసం అని గుర్తించి రాజ్యంగం రాశారన్నారు. ఆ రోజుల్లో రాజ్యంగం రాసిన తర్వాత రాజకీయాలకు స్వస్థిపలికారంటే ఆయన ఎంత విలువ కలిగిన నాయకుడో అర్థం చేసుకోవచ్చున్నారు. ఈ రోజు దేశానికి ముఖ చిత్రం లాంటి రాజ్యంగం ఉందంటే దానికి కారణం అంబేద్కర్ అన్నారు. హిందూపురం ఎంపీ పార్థసారథి మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు నెరవేరాలంటే అన్ని వర్గాల వాళ్ళు చదువుకోవాలి.

ఉన్నత ఉద్యోగాలు సాధించాలి. డబ్బు సంపాదించడంతో పాటు రాజకీయాల్లో కూడా రాణిం చాలన్నారు. గ్రామాల్లో కక్షలు కార్పణ్యాలకు దూరంగా ఉండటమే కాకుండా ఐకమత్యంగా ముందుకు సాగిం చాలన్నారు. గ్రామంలో కమ్యూనిటీ హాల్ కావాలని కోరగా ఎంపీ అక్కడికక్కడే రూ.20 లక్షలు ఎంపీ నిధుల నుంచి ఇస్తామని ప్రకటించారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పంపు కొండప్ప ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు మరూరు సొసైటీ ఛైర్మన్ గోపాల్ నాయుడు ఎస్సీ సెల్ పాలచెర్ల ముత్యాలప్ప కొత్తపల్లి నాగేష్ క్లస్టర్ ఇన్చార్జిలు రాము సోమర నారాయణస్వామి టిడిపి పెద్దన్న శ్రీనివాసులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు కాపు రామచంద్ర రెడ్డికి...

# ఘన స్వాగతం పలికిన దుర్గం బీజేపీ నాయకులు

**- దశబుజ గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన కాపు దంపతులు**






**రాయదుర్గం –సూర్య వాస్తవం, ఆగస్టు 24:** రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు కాపు రామచంద్రారెడ్డి రాకతో రాయదుర్గం బిజెపి నాయకులు ఘన స్వాగతం పలికారు. రాయదుర్గం పట్టణంలోని దశ భుజ గణపతి ఆలయంలో కాపు రామచంద్రారెడ్డి దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తన నివాసంలో బిజెపి నాయకులు , ప్రజలు కాపు అభిమానులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ...ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ నాపై నమ్మకం ఉంచి రాష్ట్రంలో పార్టీని రాష్ట్రస్థాయిలో బలోపేతానికి కృషి చేయాలని నాపై నమ్మకం ఉంచి అధిష్టానం ఈ బాధ్యత అప్పగించిందన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తూ, కార్యకర్తలకు ప్రజలకు అందుబాటులో ఉంటూ కూటమి ప్రభుత్వానికి వారిదిగా పని చేస్తూ, బిజెపి అధిష్టానం నిర్ణయించిన ప్రకారం నికస్టుగా పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు... ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, ప్రజలు, కాపు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాణాసంచాలు పేల్చారు.

# మాజీ ఎమ్మెల్యే చేతులు మీదుగా లెనిన్ హౌస్ ప్రారంభం



**పామిడి- సూర్య వాస్తవం ,ఆగస్టు 24:** పామిడి పట్టణంలో ఎస్సార్ డిగ్రీ కాలేజ్ దగ్గర నూతనంగా లెనిన్ హౌస్ ప్రారంభోత్సవానికి జమీర్ పిలుపుమేరకు మాజీ ఎమ్మెల్యే కొత్రికె బాలసుందర్ గుప్తా, తెలుగుదేశం పార్టీ నాయకులను ఆహ్వానించారు అందులో భాగంగానే ఆదివారం మాజీ ఎమ్మెల్యే,మధుసూదన్ గుప్తా తెలుగుదేశం పార్టీ నాయకులు సొసైటీ బ్యాంక్ చైర్మన్ బొల్లు శ్రీనివాస్ రెడ్డి, జింకల సంజీవ చేతుల మీదుగా ప్రారంభించారు అనంతరం మాజీ ఎమ్మెల్యే కొత్రికె మనుషులతో ముందుగా బట్టలు కొనుక్కున్న తర్వాత తెలుగుదేశం పార్టీ నాయకులతో కూడా తన షాపు వచ్చినందుకు మనమందరం వ్యాపారం చేస్తే ఇలాంటి షాపులు జమీర్ వ్యాపారం అభివృద్ధి చెందుతుందని తెలియజేశాడు.తెలుగుదేశం పార్టీ నాయకులతో గుంతకల్ నియోజకవర్గ పరిస్థితులు చాలా బాగున్నాయి ఈ మధ్యకాలంలో అందరూ కలిసికట్టుగా పనిచేస్తున్నారని తెలిసినది అందరూ సంతోషంగా ఉంటే గుంతకల్ నియోజకవర్గంలో కూడా అభివృద్ధికి బాటలు వేస్తామన్నారు లెనిన్ హౌస్ యజమాని జమీర్ మాట్లాడుతూ పిలిచిన వెంటనే వచ్చినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు అని తెలియజేశారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గుత్తి వైట్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కొట్టం మాలిక్, కలందర్, కొండాపురం రఫీ,జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శులు షేక్షా, కరూర్ జగదీష్, వడ్డే రాము,పాల్యం శర్మష్, కత్రిమల సుబ్బు ,లాయర్ సతీష్, మన్సూర్, కాజా, అబ్దుల్, సుబ్బరాయుడు, జుబేర్, అంజి, వేణు,బిజెపి నాయకులు అంజినాయక్,కుమార్,ఆచారి,డాక్టర్ నాగ మల్లారెడ్డి, విష్ణు, పంచాయతీ సిబ్బంది కాజా, బిల్ కలెక్టర్ శీనా, రమణ, బాబు, తదితరులు పాల్గొన్నారు.



# బాల్య సంరక్షణ - చిన్నారుల భవిష్యత్‌కు బలమైన పునాది

**- చిప్పల రాజేశ్వరి - దిగువ చావలి అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా ఈసీసీఈ కార్యక్రమం**






**పెళ్లకూరు–సూర్యా వాస్తవం, ఆగస్టు 24:** పెళ్లకూరు మండలం దిగువ చావలి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ఈసిసి ఈ (బాల్య సంరక్షణ,విద్య) కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని అంగన్వాడీ టీచర్ శ్రీమతి చిప్పల రాజేశ్వరి నిర్వహించారు.**చిన్నారుల సమగ్ర వికాసంపై దృష్టి:** కార్యక్రమంలో భాగంగా పిల్లలకు బాల్య సంరక్షణ, పోషకాహారం, పరిశుభ్రత, ఆటల ద్వారా విద్య, మానసిక వికాసం ప్రాధాన్యతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.పిల్లల భవిష్యత్తు బలంగా నిలవాలంటే సకాలంలో వైద్యపరీక్షలు, ఆరోగ్యకరమైన ఆహారం, ప్రారంభ దశలోనే విద్యపై శ్రద్ధ అవసరమని శ్రీమతి రాజేశ్వరి పేర్కొన్నారు. తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొనడంతో కార్యక్రమం విజయవంతమైంది.

# అంగరంగ వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**ప్యాపిలి –సూర్య వాస్తవం,ఆగస్టు 24:** ప్యాపిలి పట్టణంలో కేశవ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణుని వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.మొదట శ్రీకృష్ణుని ప్రతిమాకి అభిషేకం నిర్వహించి ధూప,దీప నై వేద్యాలను అర్పించారు.శ్రీకృష్ణుని అట పాటలునృత్యాలతో,శ్రీకృష్ణుని నామాలతో కార్యక్రమాన్ని ఊరేగింపుగా నిర్వ హించారు. అనంతరం పల్లకి మీద శ్రీకృష్ణుడుని వుంచి యువకులు, భజనలతో, శ్రీ కృష్ణుని నా మాలతో గ్రామంలో పురవీధుల గుండా పూలు చళ్ళుతు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వ హించారు.ఈ కార్యక్రమంలో ప్యాపిలి మండలంలోని ప్రభోదనందా శిశువు లు మరియు గ్రామా ప్రజలు తది తరులు పాల్గొన్నారు.

# యోగాతో ఆరోగ్యం పదిలం: డీఎస్పీ మహేంద్ర



**మదనపల్లె – సూర్య వాస్తవం, ఆగస్టు 24:** రోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని మదనపల్లె డిఎస్పి మహేంద్ర తెలిపారు. ఆదివారం ఉదయం స్థానిక డిఎస్పీ ఆఫీసులో సబ్ డివిజన్ లోని పోలీసులతో కలసి ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాలతో యోగాసనాలు నిర్వహించి న డిఎస్పీ మాట్లాడుతూ.. నిత్యం విధుల్లో ఒత్తిడిలో ఉంటా మన్నారు. ఆ ఒత్తిడి శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని, యోగానే అందుకు పరిష్కారం అన్నారు. యోగా కేవలం శారీరక వ్యాయామం కాదని తెలిపారు. అది మన మనసును ప్రశాంతంగా ఉంచుతుందని అలాగే ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచి సంపూర్ణ ఆయుష్షును పెంచుతుందని డీఎస్పీ తెలిపారు.

# శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు



**అన్నమయ్య బ్యూరో –సూర్య వాస్తవం, ఆగస్టు 24:** అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణ శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నాడు ఆంధ్ర రాష్ట్ర మొట్టమొదటి ముఖ్యమంత్రి స్వర్గీయ శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు గారి 153 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సాయి విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి మరియు అధ్యాపకులు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిగా, గురువుగా, పత్రికా సంపాదకుడిగా, రాజకీయ నాయకుడిగా, ప్రతి సందర్భంలో నమ్మిన సిద్ధాంతానికి నిలబడిన ప్రకాశంలోని పట్టుదల, నిర్భీతి ,నిష్కలంక వ్యక్తిత్వం భావితరాలకు ఆదర్శనీయమని అభిప్రాయపడ్డారు .ఉజ్వల దేశభక్తి, నిరూపమాన త్యాగ గుణం, అలుపెరగని కార్య దీక్ష ప్రకాశం పంతులను మహోన్నతునిగా మలిచాయని, యువతకు స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. వెంకటరమణ, ఎన్ఎస్ఎస్ అధికారి కే.రెడ్డయ్య వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి తీవ్ర గాయాలు



**మదనపల్లె – సూర్య వాస్తవం, ఆగస్టు 24:** రోడ్డు పై ఆగి ఉన్న లారీని ఢీ కొట్టి విద్యార్థి తీవ్ర గాయపడిన సంఘటన శనివారం అర్ధరాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. తాలుకా పోలీసుల కథనం మేరకు.. చిత్తూరు జిల్లా, పుంగనూరు మం డలం, ఈడిగపల్లెకు చెందిన రైతు శ్రీనివాసులు కుమారుడు గౌతమ్(19) మదనపల్లెలోని ఓ కళాశాలలో ఇంటర్ చదువు తున్నాడు. రాత్రి పొద్దుపోయేవరకు మదనపల్లె లోని స్నేహితుడి వద్ద ఉన్న గౌతమ్ అర్ధరాత్రి ద్విచక్ర వాహనంలో ఇంటికి బయల్దేరాడు. మార్గ మధ్యంలోని గ్రీన్ వ్యాలి స్కూల్ సమీపంలోని డాబా వద్ద రోడ్డు పక్కగా నిలిపి ఉన్న లారిని గౌతమ్ ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో గమనించిన స్థానికులు బాదితున్ని వెంటనే 108 లో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం అతని పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగుళూరు కు రెఫర్ చేశారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

# గుండెపోటుతో విశ్రాంత ఉపాధ్యాయులు మహబూబ్ బాషా మృతి



**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం, ఆగస్టు 24:** మండల పరిధిలోని లక్కిరెడ్డిపల్లె టౌన్ కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు మహబూబ్ బాషా (65) ఆదివారం సాయంకాలం మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మహ బూబ్ బాషా గుండె పోటుకు గురైన విషయం తెలుసుకున్న బంధువులు హుటాహుటిన ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.మంచికి మారుపేరుగా ఉన్న మహబూబ్ బాషా గుండె పోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న లక్కిరెడ్డిపల్లి ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ఆయన భౌతిక కాయానికి నివాళులు అర్పించారు.మండలంలోని పలువురు ఉపాధ్యాయులు ,స్థానికులు మహబూబ్ బాషా మృతి చెందిన విషయం తెలుసుకున్న నేపథ్యంలో ఒక్క సారిగా షాక్ కు గురయ్యారు.

## ఉపాధి కూలీకి డీఎస్సీలో 5వ ర్యాంకు



**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, ఆగస్టు 24:** ఎలాంటి కోచింగ్ లేకుండా ఓ యువకుడు టీచర్ జాబ్ సాధించాడు. అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం తాటిగుంటపల్లె పంచాయతీ మట్లిరెడ్డివారిపల్లె హరిజన వాడకు చెందిన జి. వెంకటేశ్వర్లు ఉపాధి కూలీ పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నాడు. టీచర్ కావాలనే కోరిక ఉన్నా ఆర్థిక పరిస్థితి సహకరించలేదు. ఐనా రామాలయం వద్ద రాత్రింబవళ్లు చదవి పరీక్ష రాశాడు. 82.357 మార్కులతో జిల్లాలో 5వ ర్యాంకు సాధించాడు. స్కూల్ అసిస్టెంట్ బయాలజీ టీచర్గా సెలెక్ట్ అయ్యాడు. దీంతో గ్రామంలోని అందరూ కృతజ్ఞతలు తెలిపారు.

## జూనియర్ ఎన్టీఆర్ అభిమానులను అదుపులోకి తీసుకున్న పోలీసులు





**పామిడి - సూర్య వాస్తవం, ఆగస్టు 24:** అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకట ప్రసాద్ ఇంటి మ ఎట్టడికి వెళ్తున్న జూనియర్ ఎన్టీఆర్ అభిమానులను ఆదివారం పామిడిలోనే పోలీ సులు అదుపులోకి తీసుకున్నారు. వార్-2 సినిమా ప్రదర్శనపై జూనియర్ ఎన్టీఆర్పై అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి దుర్భాషలాడాడని అభిమానులు ఎమ్మెల్యే ఇంటి ముట్టడికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. విషయం తెలు సుకున్న పామిడి సీఐ యుగంధర్ తన సిబ్బందితో 44వ జాతీయ రహదారిపై అంబేద్కర్ కాలనీ వద్దనే అభిమానులను నిలిపివేశారు. దీంతో అభిమానులు పోలీ సులతో వాదనకు దిగారు. తమ కథానాయకునిపై బాధ్యతాయుతమైన శాసనస భ్యులుగా ఉండి అసభ్యంగా ఎలా మాట్లాడతారంటూ నిలదీశారు. బహిరంగంగా క్షమాపణ చెప్పాలన్నారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ నుంచి సస్పెండ్ చేయాలని పట్టుబట్టారు. దీంతో పరిస్థితి ఉద్రిక్త తకు దారితీయకుండా గుత్తి, పెద్దవడుగూరు, గార్లదిన్నె పోలీసులతో పాటు అనంత పురం నుంచి స్పెషల్ పార్టీ పోలీసులు పెద్దఎత్తున చేరుకున్నారు. అనంతపురం వైపునకు వెళ్లే ప్రతి వాహనాన్ని పరిశీలించి ఆరా తీశారు. అదుపులోకి తీసుకున్న అభిమానులను గుత్తి, పెద్దవడుగూరు పోలీసు స్టేషన్లకు తరలించారు. ఉన్నతాధి కారుల ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని సీఐ యుగంధర్ తెలి పారు.

### యూరియా, ఎరువులపై అక్రమాలకు

## పాల్పడితే లైసెన్స్ క్యాన్సిల్ చేస్తాం

### - విజిలెన్స్ సీఐ నారాయణ



**లక్కిరెడ్డిపల్లి -సూర్య వాస్తవం,ఆగస్టు 24:** యూరియా ,ఎరువులపై ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వారిపై సిక్స్ ఏ కేసులు నమోదు చేసి లైసెన్సులను క్యాన్సిల్ చేయడం జరుగుతుందని విజిలెన్స్ సిఐ నారాయణ హెచ్చరించారు.ఆదివారం మండలంలోని లక్కిరెడ్డిపల్లి టౌన్ పరిధిలో ఉన్న గణేష్ ట్రేడర్స్, రైతు మిత్ర ఆగ్రోస్, జనతా ఫర్టిలైజర్స్ షాపులను సీఐ నారాయణ, కానిస్టేబుల్ యుగంధర్ ,మండల వ్యవసాయ అధికారిని జి రాజకుమారి తో కలిసి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఎరువుల దుకాణము డీలర్ ల యొక్క లైసెన్స్ వివరాలు, స్టాక్ రిజిస్టర్ ఎరువులకి సంబంధించిన అన్ని వివరాలను తనిఖీ చేసి రూల్స్ కి వ్యతిరేకంగా గాని లేక బిల్లు ఇవ్వకుండా రైతులకి ఎరువులను అమ్మటం కానీ సరైన రికార్డులు నిర్వహించకపోతే ఆ యొక్క డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిఐ నారాయణ గారు తెలియజేశారు. ఎరువులు రైతులకు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు.ఈ తనిఖీలలో వ్యవసాయ కార్యాలయ సిబ్బంది, విజిలెన్స్ అధికారులు, ఎరువుల దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి రోడ్డుపై రక్తపాతం

### - ఒకరు మృతి, ఒకరికి గాయాలు

### - ఢీకొన్న రెండు బైకులు కన్నీటి మడుగులో కుటుంబం



**పెళ్లకూరు-సూర్యా వాస్తవం, ఆగస్టు 24:** ఆదివారం రాత్రి చిల్లకూరు జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురెదురుగా దూసుకొచ్చిన రెండు బైకులు బలంగా ఢీకొనడంతో రహదారి మీదే రక్తం చిందింది. ఒక్కసారిగా అక్కడున్నవారు భయాం దోళనకు గురయ్యారు.ఈ ప్రమాదంలో చిల్లకూరు వడ్డిపాలెం గ్రామానికి చెందిన చమర్తి కిష్టయ్య (38) అక్కడికక్కడే మృతి చెందగా, మరో బైక్పై ప్రయాణిస్తున్న చిరాల రోశయ్య తీవ్రగా యాలతో కుప్పకూలాడు. స్థానికులు వెంటనే స్పందించి ఆయనను నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.కుటుంబ పోషణ భారం మోస్తున్న కిష్టయ్య ఆకస్మిక మరణంతో గ్రామం మొత్తానికి విషాద ఛాయలు అలుముకున్నాయి. కన్నీరుమున్నీరై విలపిస్తున్న కుటుంబ సభ్యులను చూసి ప్రతి ఒక్కరూ కంటతడి పెట్టకుండా ఉండలేకపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. **వేగమే బలి!** స్థానికులు మాట్లాడుతూ... "హైవేపై వాహనదారులు అధిక వేగం నియంత్రించకపోవడం వల్లే ఇలాంటి విషాదాలు జరుగుతున్నాయి. రోడ్లపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని" ఆవేదన వ్యక్తం చేశారు.

# నామినేటెడ్ పదవి ద్వారా మాదిగ జాతిని గుర్తించారు

**- టీడీపీని గుండెల్లో పెట్టుకుంటాం**
**- మాదిగలు ఆర్థిక, సామాజిక, రాజకీయంగా ఎదగాలి : ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్**



**కుప్పం- సూర్య వాస్తవం, ఆగస్టు 24:** సమాజంలో అంటరానివారుగా,అట్టడుగు వర్గాల వారిగా చూస్తున్న తమ మాదిగ జాతి సామాజిక వర్గానికి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రాధాన్యతనిస్తూ తమ జాతి నేతలను నామినేటెడ్ పదవు లలో నియమించడం గర్వంగా భావిస్తున్నామని ఆ సామాజిక వర్గ నేతలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కుప్పం పట్టణంలో ఆదివారం ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ నివాసంలో వారు సమావేశం నిర్వహించారు. కుప్పం నియోజకవర్గంలోని కుప్పం, శాంతిపురం, రామకుప్పం,గుడుపల్లి, మండలాలకు చెందిన మాదిగ విద్యార్థి విభాగం, కుల పెద్దలు, మాదిగ తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన కార్యకర్తలు, ఎంఆర్ పిఎస్ నాయకులు, మాదిగ దళిత నేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు.కూటమి ప్రభుత్వం కేటాయించిన నామినేటెడ్ పదవులలో మాదిగ కులాన్ని గుర్తించి గత 40 సంవత్సరాలలో ఎన్నడూ లేని విధంగా రెస్కో డైరెక్టర్ గా సతీష్ మాదిగకు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా వారు శాలువలు, గజమాలతో రెస్కో డైరెక్టర్ సతీష్ను , ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ హుడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబుని ఘనంగా సన్మానించారు. అన ంతరం దళిత ఉద్యమనేత దేవరాజు మాదిగ మాట్లాడుతూ గత 40 సంవత్సరాలు నుండి ఎన్నడూ లేని విధంగా సామాజిక సూత్రానికి కట్టుబడి మొట్టమొదటి సారిగా కుప్పం చరిత్రలోనే మాదిగలకు నామినేటెడ్ పదవి కేటాయించడం గర్వంగా ఉందన్నారు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎన్నో జాతీయ, ప్రాంతీయ పార్టీలు తమని ఓటు బ్యాంకు గానే భావించారని అన్నారు.కానీ తమ జాతి ఉనికిని గుర్తించి మాదిగలు కూడా ఆర్థిక సామాజిక రాజకీయ రంగాల్లో ఎదగాలని కోరుకున్నది ఒక్క తెలుగుదేశం పార్టీ మాత్రమే అన్నారు.అందుకే తాము తెలుగుదేశం పార్టీని గుండెల్లో పెట్టుకుంటామని ఆనందం వ్యక్తం చేశారు. అలాగే కుప్పం నియోజకవర్గం లోని మండలాలకు సంబంధించిన నామినేటెడ్ పదవుల ను మాదిగ కులస్తులకు కేటాయించాలని విన్నవించారు అనంతరం కుప్పం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ రాజకుమార్ మాదిగ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం నేడు మాదిగ కులాన్ని గుర్తించి పదవి ఇవ్వడం పట్ల సంతోషాన్ని వ్యక్తంచేశారు.ఈ సందర్భంగా ఆయన మాదిగ జాతిని ప్రపంచ పటంలో నిలిపిన జననేత మందకృష్ణ మాదిగకు తెలుగుదేశం పార్టీ క్రియాశీలక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రెస్కో డైరెక్టర్ సతీష్ మాట్లాడుతూ ఈ గౌరవం తనకు దక్కింది కాదని ఇది కుప్పం నియోజకవర్గంలో ఉన్న ప్రతి మాదిగకు చెందిన గౌరవంగా తాను భావిస్తున్నానని అన్నారు. ఇకనుండి తెలుగుదేశం పార్టీకి అన్ని రకాలుగా అండదండలు అందిస్తూ లక్ష మెజారిటీయే లక్ష్యంగా తమ జాతి నేతలు పనిచేస్తామని తెలిపారు. అనంతరం ఈ సమావేశంలో ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్బాబు మాట్లాడుతూ మొదటి నుండి సామా జిక న్యాయ అంశానికి కట్టుబడ్డ ఏకైక పార్టీ తెలుగు దేశం పార్టీ అని అన్నారు. అలాగే తాను కూడా బలహీన వర్గాలకు అండగా ఉంటానని నన్ను పిలిచేటప్పుడు ప్రేమతో సురేష్ బాబు మాదిగగా ఆప్యాయంగా పిలవాలని కోరారు.అన్ని స్థానిక మరియు పార్టీ పదవుల్లో మాదిగలకు ప్రాధాన్యం అందించే విధంగా తాము కృషి చేస్తామని హామీ ఇచ్చారు. చివరిగా ఎమ్మెల్సీ కుప్పం తెలుగుదేశం పార్టీ సమన్వ యకర్త పెద్దలు కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ అన్ని విధాల మాదిగల పక్షాన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యువ నాయకుడు ఐటీ మంత్రివర్యులు నారా లోకేష్ తో పాటు తాను మాదిగ కులస్తుల ఎదుగుదలకు పాటుపడ తామన్నారు. పార్టీ క్రియాశీలక పదవుల్లో కూడా అందరితో చర్చించి గుర్తింపు తీసుకొచ్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో దళిత ఉద్యమ నేత దేవరాజు మాదిగ ఎంఆర్ పిఎస్ నాయకులు రాజ్ కుమార్ మాదిగ, రాజేష్ మాదిగ, జనసేన పార్టీ జిల్లాసంయుక్త కార్యదర్శి వేణు మాదిగ, తెలుగుదేశం పార్టీ నాయకులు డివి రామచంద్ర, రమేష్, సుబ్రహ్మణ్యం, నరసింహ, బాలు, కదిరప్ప, నాగరాజు, జయరాం, నారాయణస్వామి, మునిరాజు, విద్యార్థి నాయకులు సతీష్, చంద్రశేఖర్, వెంకటేష్, జనసేన పార్టీ నాయకులు శ్రీకాంత్, భాస్కర్, మాదిగ ఉద్యోగస్తులు ఆనంద్, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఉద్యోగ రీత్యా సహదేవ రెడ్డి సేవలు అభినందనీయం

**- మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి, ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి**



**లక్కిరెడ్డిపల్లి -సూర్య వాస్తవం ,ఆగస్టు 24:** ఉద్యోగరీత్యా ఉపాధ్యాయులు సహదేవరెడ్డి సేవలు అభినందనీయమని లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్రెడ్డి, లక్కిరెడ్డిపల్లి ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్రెడ్డి , రామా పురం మాజీ ఎంపీపీ గడికోట ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి సోదరుడు సుదీప్ కుమార్ రెడ్డిలు పేర్కొన్నారు.గాలివీడు మండలంలోనీ ప్రభుత్వ పాఠశాలలో పనిచేసున్న సహదేవరెడ్డి పదవీ విరమణ అనంతరం లక్కిరెడ్డిపల్లె పీజీఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో సహదేవరెడ్డి ఎంతోమంది విద్యా ర్థులను ఉన్నత స్థాయికి చేరుకునేలా విద్యాబుద్ధులను నేర్పిం చడంలో తన వంతు మన్ననలు పొందాడని వారు కొనియాడారు. సహదేవ రెడ్డి శేష జీవితం వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలని వారు ఆకాంక్షించారు. సహదేవ రెడ్డి సతీమణి కల్పన వైఎస్ఆర్సిపి అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షురాలుగా పార్టీ కోసం అనునిత్యం కృషి చేయడం అభినందనీయమని వారు అన్నారు. వారిరువురికి గజమాలవేసి దుశ్యాలు వాళ్లతో సత్కరించి సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గాలివీడు మాజీ ఎంపీపీ రెడ్డప్పరెడ్డి , సర్పంచులు వెంకట్ నారాయణరెడ్డి, జనార్దన్ రెడ్డి , చెంద్రాయుడు, ఎంపీటీసీలు జగన్మోహన్రెడ్డి, లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ రాజారెడ్డి, మాజీ సర్పంచులు దుర్గయ్య, మాజీ గంగమ్మ ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, వైయస్సార్సీపి నాయకులు గంగిరెడ్డి, రవి రెడ్డి,లక్ష్మీరెడ్డి, సభాపతి నాయుడు, వరుణ్ కుమార్, రంగారెడ్డి , సుబ్బయ్య, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె మండలాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

### సన్నారెడ్డి దయాకర్ రెడ్డిని

# సన్మానించిన ఎస్జె పోట్లపూడి రాజేష్


**నాయుడుపేట -సూర్య వాస్తవం, ఆగస్టు 24:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రెండవసారి నియ మితులైన నాయుడుపేట పట్టణానికి చెందిన సన్నారెడ్డి దయాకర్ రెడ్డిని ఆయన మిత్రుడు టిడిపి నేత,ఎస్ జ్యువలరీస్ అధినేత పోట్లపూడి రాజేష్ ఘనంగా సన్మానించారు. సన్నారెడ్డి దయాకర్రెడ్డి రెండవసారి బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా బిజెపి నాయుడుపేట పట్టణ అధ్యక్షులు పి.రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయుడుపేట పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా టిడిపి నేత పోట్లపూడి రాజేష్ బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డికి శాలువా కప్పి పూలమాలవేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ.... తన మిత్రుడు సన్నారెడ్డి దయాకర్ రెడ్డి బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రెండవసారి నియ మితులవడం చాలా సంతోషకరం అన్నారు.ఆయన మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించి,ప్రజా సమస్యలపై పోరాటం సాగించాలని అన్నారు.



# ఆగని ఎమ్మెల్యేల తప్పిదాలు

**అనంతపురం-సూర్య వాస్తవం:** కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత ఏడాదిలోనే అనేక వివాదాలు చోటు చేసుకున్నాయి. అయితే ప్రభుత్వ పరంగా కాదు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల కాదు. కేవలం ఎమ్మెల్యేల వల్లనే పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది. ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకూ ఎమ్మెల్యేలో చాలా మంది పార్టీ లైన్ దాటి వ్యవహ రిస్తున్నారు. లెక్కలేని తనం వారిలో కనిపిస్తుంది. నియోజ కవర్గానికి తామే బాస్‌లుగా వ్యవహరిస్తున్నారు. తాము ఎన్నికయింది ఎవరి వల్లనన్నది గుర్తించని పరిస్థితుల్లోకి కొందరు ఎమ్మెల్యేలు వచ్చేశారు. అందుకే టీడీపీ నాయ కత్వానికి ఈ ఎమ్మెల్యేలతో ఇబ్బందికరంగా మారింది. నిజానికి చెప్పాలంటే చంద్రబాబు నాయుడు గత మూడు దఫాలు ముఖ్యమంత్రిగా చేసినప్పుడు తలెత్తని వివాదాలు ఇప్పుడు కనిపిస్తున్నాయి నాడు ఎమ్మెల్యేలు ఒక పద్ధతిని పాటించేవారు. నియోజకవర్గాల్లో ఎలాంటి అవినీతి పనులకు, అక్రమాలకు వేలు పెట్టేవారు కాదు. అవసర మనుకుంటే స్థానిక నియోజకవర్గ ప్రజలకు సాయం చేసి వారి మన్ననలను పొందేవారు. కాకుంటే బయట ప్రాంతాల్లో వ్యాపారాలు చేసుకోవడంతో పాటు ఏదో ఒక




పెద్ద పైరవీని చేసుకుని తాము ఎన్నికల్లో ఖర్చు పెట్టుకున్న మొత్తాన్ని తిరిగి రాబట్టుకునే ప్రయత్నం చేసేవారు. అప్పట్లో ఇవేమీ బయటకు వచ్చేవి కావు. కానీ ఇప్పుడు ఇలా కాదు. నియోజకవర్గాల్లోనే ఎమ్మెల్యేలు దుకాణాలు తెరిచారు. ఇసుక, మద్యం ఏ విషయంలోనూ వేలు పెట్టకుండా ఉండలేకపోతున్నారు. నియోజకవర్గం ప్రజల వద్దనే చేతులు కూడా చాచేవారు కూడా లేకపోలేదు.

దీనికి తోడు హంగామా, అనుచరుల ముందు ఎమ్మెల్యే అని చెప్పుకోవడానికి చేస్తున్న వీరంగం చేస్తున్నారు. వీరిని కంట్రోల్ చేయడం నాయకత్వానికి కూడా సాధ్యం కాదు. అలవాటు పడిన ప్రాణం ఊరికే ఉండదు. అందుకే ఎమ్మెల్యేలు చేసిన తప్పులను ఒక్కొక్కటిగా నాయకత్వం లెక్క పెట్టుకోవాల్సి వస్తుంది. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేల పనితీరుపై నివేదికలు తెప్పించుకుంటున్నారు. పార్టీ నుంచి సస్పెండ్ చేసుకుంటూ పోతే చాలా మందిని చేయాల్సి వస్తుంది. అందుకే వార్నింగ్‌లతో సరిపెడుతున్నారు. అయితే ప్రస్తుతం ఉన్నఎమ్మెల్యేల్లో చాలా మందికి వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు దొరకడం కూడా కష్టమేనని అంటున్నారు. మొన్నటి ఎన్నికల్లోనే చంద్రబాబు సీనియర్ నేతలను నిర్దాక్షిణ్యంగా పక్కన పెట్టారు. ఈసారి ఇప్పుడు వివాదాల్లో చిక్కుకుంటున్న వారికి మాత్రం నో టిక్కెట్ అన్నది పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్న టాక్. కార్యకర్తల అభిప్రాయం కూడా ఇలాగే ఉండటంతో నాలుగేళ్లు వీరు ఏం చేసినా వార్నింగ్‌లతో సరి పెట్టాల్సిందే. అంతే తప్ప చర్యలుండవు. అసలు చర్యలు ఎన్నికల్లోనే.


# జగన్ జైలు రన్...కొంత మందికే పరామర్శ

**విజయవాడ-సూర్య వాస్తవం:** అధికారం పోయిన తర్వాత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నేతలంతా వివిధ కేసుల్లో జైలుకు వెళ్తున్నారు. వల్లభనేని వంశీ నుంచి కాకాణి గోవర్ధన్ రెడ్డి వరకూ చాలా మంది నేతలు జైళ్లకు వెళ్లారు. వారందర్నీ జగన్ ఆయా జైళ్లకు వెళ్లి పరామర్శించారు. పోసాని వంటి కొంత మందిని పరామర్శించలేదు. అదే సమయంలో లిక్కర్ స్కామ్‌లో అరెస్టయిన వారెవర్నీ పరామర్శించలేదు. ఈ కేసులో అరెస్టు అయిన వారందరూ జగన్‌కు అత్యంత సన్నిహితులే. మిథున్ రెడ్డి .. వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడు. ఆయనకు లిక్కర్ కేసుతో ఏం సంబంధం లేదని జగన్ పలుమార్లు ప్రెస్మీట్లలో చెప్పారు. అయితే సుప్రీంకోర్టులోనూ ఊరట లభించ కపోవడంతో చివరికి రాజంపేట ఎంపీ అరెస్టు కావాల్సి వచ్చింది. కానీ జగన్మోహన్ రెడ్డి ఇప్పటి వరకూ ఆయనను పరామర్శించలేదు. ఇరవై ఐదో తేదీన జగన్ .. మిథున్ రెడ్డిని పరామర్శించేందుకు రాజమండ్రి వస్తారని బొత్స సత్యనారాయణ ప్రకటించారు. కానీ ఒక్క రోజులోనే ఆ ప్రోగ్రాం క్యాన్సిల్ అయినట్లుగా బొత్స ప్రకటించారు. ఇక జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితంగా పని చేసిన రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయ్ రెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డిలను కూడా జగన్ పరామర్శించలేదు. వారిద్దరూ జగన్‌కు అత్యంత సన్నిహితులు. ధనుంజయ్ రెడ్డి.. జగన్ సీఎంగా ఉన్న ఐదు సంవత్సరాల పాటు సీఎంవోలో చక్రం తిప్పారని అంటారు. అన్ని పనులు ఆయన చేతుల మీదుగానే జరిగేవని చెబుతారు. అలాంటి ధనుంజయ్ రెడ్డి అరెస్టు అయినా జగన్.. జైలుకు వెళ్లి పరామర్శించలేదు. కృష్ణమోహన్ రెడ్డి కూడా జగన్‌కు సన్నిహితులే. వీరిని కూడా ఎందుకు పట్టించుకోవడం లేదన్న ప్రశ్నలు వస్తున్నాయి. లిక్కర్ కేసులో జగన్మోహన్ రెడ్డి పేరు కూడా ఉందని ప్రచారం జరుగుతోంది. సిట్ దాఖలు చేసిన అనుబంధ చార్జిషీట్‌లో జగన్ ప్రస్తావన




ఉంది. అసలు ఈ లిక్కర్ స్కామ్‌లో అంతిమ లబ్దిదారుడు జగన్మోహన్ రెడ్డేనని సిట్ చెబుతోంది. ఇలాంటి సమయంలో లిక్కర్ కేసు నిందితుల్ని పరామర్శించకపోవడం వెనుక ప్రత్యేక వ్యూహం ఉందంటున్నారు. వారిని పరామర్శిస్తే అందరూ కలిసి ప్లాన్ చేశారని.. అందుకే వారి కోసం జైలుకు వచ్చారని ప్రచారం జరిగే అవకాశం ఉందని వైసీపీ వర్గాలు అనుమానిస్తున్నాయి. లాయర్లు, న్యాయనిపుణుల సూచనల మేరకే జగన్.. తనకు అత్యంత ఆత్మీయులు అయినప్పటికీ లిక్కర్ కేసు నిందితుల్ని జైలుకు వెళ్లి పరామర్శించడం లేదని చెబుతున్నారు. అయితే టీడీపీ నేతలు మాత్రం జగన్మోహన్‌రెడ్డి అందర్నీ బలి చేసి తాను తప్పించు కునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శిస్తున్నారు. కోటరీ నుంచి బయటకు ఎప్పుడువైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోయి పదమూడు నెలలు కావస్తుంది. ఈ పదమూడు నెలల్లో పార్టీ బలోపేతానికి అవసరమైన చర్యలు ఏమైనా తీసుకున్నారంటే ఏమీ లేదనే చెప్పాలి. ప్రభుత్వ నిర్ణయాలు,హామీలు అమలు చేయకపోవడంపై నిరసనలు వ్యక్తం చేయడం మినహా క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి తీసుకున్న చర్యలు ఏమైనా ఉన్నాయా? అంటే శూన్యమే అని చెప్పాలి. వైసీపీ అధినేత వైఎస్ జగన్ బెంగళూరు నుంచి తాడేపల్లికి నెలలో రెండు సార్లు రావడం అందుబాటులో ఉన్న నేతలతో సమావేశం కావడం మినహా మరే రకమైన కార్యక్రమాలను చేపట్టలేదు. ఇక రైతుల సమస్యలపై జిల్లాలకు వెళ్లి వారి బాగోగులను తెలుసుకోవడం, అక్రమ కేసుల్లో ఇరుక్కున్న పార్టీ నేతలను పరామర్శించడం వంటి వాటితో సరిపెట్టేశారు. ఇక ఓటమిచెందిన తొలి నాళ్లలో ముఖ్య కార్యకర్తలతో జగన్ ముఖాముఖి అని హడావిడి చేసినా ఒకటి రెండు జిల్లాలతోనే సరిపెట్టేశారు. అందులోనూ స్థానికసంస్థల ప్రతినిధులు అధికార పార్టీకి వెళ్లకుండా ఉండేందుకు తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశాలు పెట్టి పార్టీలో కొనసాగితే రాజకీయ భవిష్యత్ ఉంటుందని భరోసా ఇచ్చారు. నిజానికి 2019 ఎన్నికల్లో టీడీపీ ఓటమి పాలయిన తర్వాత చంద్రబాబు ఊరికే కూర్చోలేదు. జిల్లాలను పర్యటించారు.నేరుగా జిల్లాలకే వెళ్లిన చంద్రబాబు నేతలు,కార్యకర్తలతో సమావే శమ య్యారు. ఇప్పుడు ఓటమి భవిష్యత్ విజయానికి నాంది అని చెప్పి క్యాడర్‌లో ధైర్యం నింపడంలో నాడు చంద్ర బాబునాయుడు సక్సెస్ అయ్యారు. కానీ అధికారంలో ఉన్నప్పుడు జగన్ ఎలా ఉన్నారో.. కోల్పోయినప్పుడు కూడా అదే స్థాయిలో తాడేపల్లి పార్టీ కార్యాలయాన్ని వీడటం లేదు. పాదయాత్ర చేస్తారనని అంటున్నాఅందుకు చాలా సమయం ఉంది. కానీ అంతకంటే ముందుగా జిల్లాల్లో సమావేశాలు నిర్వహించాలి. జిల్లా కేంద్రాల్లో అన్ని నియోజకవర్గాల ముఖ్య కార్యకర్తలు,నేతలను పిలిచి మాట్లాడాలి. వారి అభిప్రాయాలను తెలుసుకోవాలి. అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వం చేసిన తప్పులను వారి నుంచి తెలుసుకోవాలి. ఓపిగ్గా వినాలి. మరొకసారి అధికారంలోకి వస్తే అలాంటి తప్పులు దొర్లవన్నహామీ వారికి అక్కడే ఇవ్వగలిగాలి. అంతేకాని అధికారంలో ఉన్నప్పటి లాగానే కోటరీ మధ్య చిక్కుకుంటే పరిస్థితుల్లో మార్పు రాదన్న విషయం జగన్ గుర్తించాలన్నది పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్న టాక్. మరి నేను ఉన్నాను.. నేను విన్నానంటూ జనం మధ్య నాడు వెళ్లినట్లే ఇప్పుడు క్యాడర్ మధ్యకు వైసీపీ చీఫ్ వెళ్లాల్సి ఉంది.


## సాయుధ పోరాటంలో
# ఉవ్వెత్తున ఎగసిన ఉద్యమ కెరటం దాశరథి రంగాచార్యులు



అక్షరమే ఆయన ఆయుధం, సాయుధ పోరాటంలో ఉవ్వెత్తున ఎగసిన ఉద్యమ కెరటం, తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ఎలుగెత్తి చాటిన అభ్యుద యవాది. తన రచనలతో నిజాం నిరంకుశత్వాన్ని ఎదురించిన మహోన్నత వ్యక్తి, తన రచనలతో సమాజాన్ని చైతన్యం చేసిన అక్షర వాచస్పతి దాశరథి రంగాచార్య. దాశరథి రంగాచార్యులు ఖమ్మం జిల్లా లోని చిట్టి గూడూరులో జన్మించారు. ఆయన అన్న ప్రముఖ కవి, సాయుధపోరాట యోధుడు దాశరథి కృష్ణమాచార్యులు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. సాయు ధపోరాట కాలంలో ఉపాధ్యాయునిగా, గ్రంథపాలకునిగా పనిచేశారు. సాయుధపోరాటం ముగిసాకా సికింద్రాబాద్ పురపాలక కార్పోరేషన్లో 32 ఏళ్ళు పనిచేసి ఉద్యోగవిరమణ చేశారు. నైజాం రాజ్యంలో నిజాం పాలన కాలంలో జన్మించిన దాశరథి రంగాచార్య ఎదుగు తూండగా ఆంధ్రమహాసభ, ఆర్య సమాజాలు వేర్వేరుగా నిజాం పాలనలోని లోపాలను ఎదుర్కొంటున్న తీరుకు ఆకర్షితులయ్యారు. తండ్రి సనాతనవాది ఐనా అన్నగారు ప్రఖ్యాత కవి, అభ్యుదయవాది కృష్ణమాచార్యుల సాంగత్యంలో అభ్యుదయ భావాలను, విప్లవ భావాలను అలవర్చుకున్నారు.

అసమానతలకు, అణచివేతకు నిలయంగా మారిన నాటి నైజాం సమాజాన్ని గమనించి పెరిగిన రంగాచార్యులు 1945ల్లో ప్రారంభమైన తెలంగాణ సాయుధ పోరాటంలో క్రియాశీలకమైన పాత్ర పోషించారు. తండ్రి కుటుంబకలహాల్లో భాగంగా తల్లినీ, తమనూ వదిలివేయడంతో అన్నతో పాటుగా ఉంటున్న రంగాచార్యులకు ఆపై సాయుధ పోరాటంలో కృష్ణమాచార్యులను అరెస్టు చేయడంతో కౌమార ప్రాయం ముగిసేలోపే కుటుంబ బాధ్యతలు స్వీకరించాల్సి వచ్చింది. కుటుంబ బాధ్యతల కారణంగా గ్రంథపాలకునిగా, ఉపాధ్యాయునిగా పనిచేస్తూనే ఆనాటి సమాజంలో అసమానతల గురించి ప్రజలను చైతన్యపరిచారు. ఆ క్రమంలో రంగాచార్యుల కుటుంబంపై నైజాం ప్రభుత్వ అనుకూలురు, భాగస్వాములు దాడిచేసినా వెనుదీయలేదు. పోరాటం కీలకదశకు చేరుకున్న కాలానికి ఆయన కాంగ్రెస్ దళంలో చేరి సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. ఈ క్రమంలో రంగాచార్యులు తుపాకీ బుల్లెట్టు దెబ్బ తప్పించుకుని ప్రాణాపాయాన్ని కూడా ఎదుర్కొన్నారు. తెలంగాణా సాయుధ పోరాటం నాటి స్థితిగతులు, ఆ కాలంలోని దారుణమైన బానిస పద్ధతులను దాశరథి రంగాచార్యులు చిల్లర దేవుళ్ళు, మోదుగుపూలు, జనపదం నవలల్లో చిత్రీకరించారు. చిల్లర దేవుళ్లు నవలలో సాయుధపోరాటం ముందు స్థితిగతులు, మోదుగుపూలు నవలలో తెలంగాణ సాయుధ పోరాటకాలం నాటి పరిస్థితులు, అనంతర పరిస్థితులు "జనపదం"లో అక్షరీకరించారు. వట్టికోట ఆళ్వారుస్వామి ప్రజల మనిషి, గంగు వంటి నవలల ద్వారా నాటి జీవన చిత్రణ చేయాలనే ప్రయత్నం ప్రారంభించారు. ఆ నవలల ప్రణాళిక పూర్తి కాకుండానే ఆళ్వారు స్వామి మరణించారు. సాయుధపోరాట యోధులుగా, సాహిత్యవేత్తలుగా ఆళ్వారుస్వామికీ, రంగాచార్యులకూ సాన్నిహిత్యం ఉండేది. పోరాటానికి పూర్వం,ఆ నవలా పరంపరలో తొలి నవలగా 1942వరకూ ఉన్న స్థితిగతులు "చిల్లర దేవుళ్లు"లో కనిపిస్తాయి. తొలుత కమ్యూనిస్టు భావజాలంతో ప్రభావితమైన రంగాచార్యులు తదనంతర కాలంలో ఆధ్యాత్మిక భావాలను అలవరుచుకున్నారు. ఈ నేపథ్యంలో రంగాచార్యులు శ్రీమద్రామాయణం, శ్రీ మహాభారతాలను సరళంగా తెలుగులో రచించారు. రంగాచార్య రచించిన చిల్లర దేవుళ్లు పలు భాషల్లోకి అనువాదమైంది. దీనికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం కూడా వచ్చింది. అభినవ వ్యాసుడిగా బిరుదు అందుకున్న రంగాచార్య 2015 జూన్ 8వ తేదీన కన్నుమూశారు.

# కోస్తా జిల్లాల్లో యాచకం... నిషేధం..



**కాకినాడ-సూర్య వాస్తవం:** ఏపీ ప్రభుత్వంమరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రధాన నగరాల్లో యాచకులు లేకుండా చూడాలని చూస్తోంది. ఇప్పటికే విశాఖలో పోలీస్ శాఖ ఆ పని చేస్తోంది. అయితే ఇప్పుడు ప్రధాన నగరాల్లో యాచకులు లేకుండా చేయాలని.. వృత్తిని నిరోధించే ఏపీ యాచక నిరోధక చట్ట సవరణ ముసాయిదా బిల్లుకు ఏపీ క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. త్వరలో జరగనున్న అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో ఈ బిల్లు ఆమోదం పొందనుంది. గవర్నర్ ఆమోదంతో చట్టాన్ని అమలు లోకి తెస్తారు. ఈ బిల్లు ప్రకారం రాష్ట్రంలో ప్రధాన నగరాలుగా ఉన్న విశాఖ విజయవాడ, తిరుపతి, కర్నూలు, అమరావతి, గుంటూరు, రాజమండ్రి, విజయ నగరంలో యాచక వృత్తిని నిషేధిస్తారు. యాచకులు లేని నగరాలుగా తీర్చిదిద్దనున్నారు. ప్రస్తుతం పేదరిక నిర్మూలనకు ఏపీ ప్రభుత్వం పి4 ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇంకోవైపు పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో పేదరికాన్ని సూచికగా ఉండే యాచకులు లేకుండా చేయాలన్నది ప్రభుత్వ సంకల్పం.ప్రస్తుతం దేశవ్యాప్తంగా యాచకులు ఉన్న రాష్ట్రాల్లో ఉత్తర ప్రదేశ్ తొలి స్థానంలో ఉంది. తమిళనాడు రెండు, ఢిల్లీ మూడో స్థానంలో ఉంది. నాలుగో స్థానంలో ఏపీ కొనసాగుతోంది. అయితే ఏపీలో యాచకుల సంఖ్యను తగ్గించాలని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రధానంగా పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని చూస్తోంది. దానికి యాచకులు అవరోధంగా భావిస్తోంది. అందుకే వారికి ప్రత్యామ్నాయ ఉపాధి, విద్యా వైద్యం వంటి సౌకర్యాలు కల్పించి.. సాధారణ పౌరులుగా జీవించేలా చేయనుంది. వారికోసం ప్రత్యేక షెల్టర్లను సైతం అందుబాటులోకి తేనుంది.విశాఖలో పోలీస్ శాఖ ద్వారా యాచకులను షెల్టర్లకు తరలించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. చాలామంది గ్రామాల నుంచి వచ్చి యాచక వృత్తిని ఆశ్రయిస్తున్నారు. అటువంటి వారిని గుర్తించి కౌన్సిలింగ్ ఇస్తున్నారు. సంక్షేమ పథకాలతో పాటు పౌర సేవలు అందించి వారిని సాధారణ పౌరులుగా మార్చుతున్నారు. విశాఖలో వీధిలో కనిపించే యాచకులను గుర్తిస్తున్నారు. నిరాశ్రయులకు భోజన వసతి కల్పిస్తున్నారు. వారికోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కరోనా తరువాత నగరాల్లో యాచకుల సంఖ్య పెరిగింది. ముఖ్యంగా ప్రముఖ దేవస్థానాలు ఉన్నచోట వీరు పెరుగుతూ వచ్చారు. తాజాగా ప్రభుత్వం యాచక వృత్తిని నిషేధించాలని భావించింది. ప్రధాన నగరాలతో పాటు ప్రముఖ పుణ్యక్షేత్రాలను సైతం ఆ జాబితాలో చేర్చింది. తిరుమల, విజయవాడ కనకదుర్గమ్మ, శ్రీశైలం, సింహాచలం, అన్నవరం, రామ తీర్థాలు వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో సైతం ఇకనుంచి యాచకులు కనిపించకుండా పగడ్బందీ చర్యలు చేపట్టనున్నారు.

# విశాఖ చుట్టూ టౌన్ షిప్స్

**విశాఖపట్టణం-సూర్య వాస్తవం:** ప్రభుత్వం సరికొత్త ఆలోచనలు చేస్తోంది. ముఖ్యంగా నగరీకరణ పై దృష్టి పెట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రధాన నగరాలు మరింతగా విస్తరించాలని భావిస్తోంది. నగరాల చుట్టూ కొత్తగా ధీమ్ బేస్డ్ పట్టణాలు, టౌన్ షిప్ లు, సిటీస్ నిర్మించాలన్న ఆలోచన చేస్తోంది. నగర జనాభా పెరుగుతున్న దృష్ట్యా.. వారి అవసరాలకు అనుగుణంగా ముందే సౌకర్యాలు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఇప్పటికే నీతి ఆయోగ్ విశాఖను ప్రత్యేక గ్రోత్ సిటీగా గుర్తించింది. నగరానికి అనుసంధానంగా పట్టణాలు నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. దాదాపు 1000 ఎకరాల్లో భూమిని సేకరించనుంది. ఈ విధానాన్ని ఇతర నగరాల్లో కూడా అమలు చేయనున్నారు.విశాఖ నగరం చుట్టూ కొత్త తరహా పట్టణాలు రాబోతున్నాయి. అనకాపల్లి తో పాటు విజయనగరం ప్రాంతాల్లో ధీం బేస్డ్ పట్టణాలను, సిటీలను, టౌన్ షిప్ లను అభివృద్ధి చేయనున్నారు. ఐటి, వైద్యం, పర్యాటక రంగం వంటి వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి ప్రైవేట్ సంస్థలను ఆశ్రయిస్తారు. ప్రస్తుతం విశాఖ జనాభా 21 లక్షలకు దాటింది. ఇది మరింత పెరిగే అవకాశం ఉంది.

అందుకే చుట్టుపక్కల ప్రాంతాల్లో కొత్త పట్టణాలు నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోంది.విశాఖ పరిసర ప్రాంతాల్లో.. విజయనగరం తోపాటు అనకాపల్లి జిల్లాలు ఉన్నాయి. అక్కడ దాదాపు 1000 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు భూములను గుర్తించారు. భూ సమీకరణ పథకం ద్వారా ప్రైవేటు భూములను సమీకరిస్తారు. భూమి యజమానులకు నష్టపరిహారం అందిస్తారు. అయితే ఇలా గుర్తించిన భూముల్లో ఐటి, పర్యాటకం, వైద్యం, వినోదం, వాణిజ్యం, పరిశ్రమలు వంటి విభిన్న రంగాల్లో అభివృద్ధి చేస్తారు. ప్రైవేటు సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి ప్రభుత్వం ఆహ్వానం పలుకుతోంది. తద్వారా స్థానికులకు సైతం ఉద్యోగాలు లభిస్తాయి. ఎప్పటికీ నీతి ఆయోగ్ సిఫార్సులలో విశాఖకు చోటు దక్కింది. గ్రోత్ సిటీగా గుర్తింపు సాధించింది. అయితే ఇటువంటి నగరాలలో అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో లక్ష కోట్లు కేటాయించింది. దీని ద్వారా ధీమ్ ఆధారిత నగర నిర్మాణాలు సులువు అవుతాయని అధికారులు భావిస్తున్నారు. మొత్తానికి అయితే విశాఖకు ఈ నిర్ణయంతో మహర్దశ పట్టినట్టే.






## పవన్ ఓజీ స్పెషల్ షోస్..

# నెల ముందే అడ్వాన్స్ బుకింగ్స్!

టాలీవుడ్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అంతా ఇప్పుడు ఓజీ మూవీ కోసం వేయి కళ్లతో వెయిట్ చేస్తున్న విషయం తెలిసిందే. కొద్ది నెలలుగా రాజకీయాలతో బిజీగా ఉన్న పవన్.. ఇప్పుడు తాను ఒప్పుకున్న సినిమాలను పూర్తి చేస్తున్నారు. అందులో భాగంగా కొన్ని రోజుల క్రితం ఓజీ మూవీ షూటింగ్ ను కంప్లీట్ చేశారు. సుజిత్ దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమాను డీవీవీ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై ప్రముఖ నిర్మాత డీవీవీ దానయ్య దాదాపు రూ.250 కోట్ల బడ్జెట్ తో రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. సినిమాలో పవన్ కళ్యాణ్ సరసన ప్రియాంక మోహన్ హీరోయిన్ గా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ ఇమ్రాన్ హష్మీ విలన్ రోల్ లో కనిపించనున్నారు. అర్జున్ దాస్, శియా రెడ్డి, హరీష్ ఉత్తమన్, అభిమాన్యు సింగ్, అజయ్ ఘోష్, సిరి లెళ్ల ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ ఎస్ థమన్ సంగీతం అందిస్తున్నారు. గ్యాంగ్ స్టర్ డ్రామాగా రూపొందుతున్న ఓజీ మూవీ.. సెప్టెంబర్ 25వ తేదీన దసరా కానుకగా గ్రాండ్ గా థియేటర్స్ లో రిలీజ్ కానుంది. అయితే ఇప్పటికే ఆడియన్స్‌లో మూవీపై విపరీతమైన బజ్ ఉంది. మేకర్స్ ఇచ్చిన అప్డేట్స్ తో వేరే లెవెల్ హైప్ క్రియేట్ అయింది. ఎప్పుడెప్పుడు సినిమా వస్తుందోనని వెయిట్ చేస్తున్నారు. దీంతో ఓజీ బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్స్ సాధిస్తుందని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. మేకర్స్ భారీ స్థాయిలో రిలీజ్ చేసేలా చూస్తున్నారు. అదే సమయంలో ఓవర్సీస్ లో ఈ మధ్య కాలంలో పాన్ ఇండియా సినిమాలు భారీ ఓపెనింగ్స్ సాధిస్తున్నాయి. ఇప్పుడు ఓజీ కూడా అందుకు సిద్ధమవుతోంది. అమెరికాలో ఓజీ అడ్వాన్స్ బుకింగ్స్ ఆగస్టు 29వ తేదీన ప్రారంభమవుతున్నాయి. అంటే రిలీజ్ కు నెల రోజుల ముందే. ఈ మేరకు ఓజీ మేకర్స్ ధ్రువీకరించారు. ప్రీమియర్స్ షోస్ కూడా వేయనున్నారు. అయితే ఇప్పుడు ఉన్న క్రేజ్ ను చూస్తుంటే మాత్రం.. అమెరికాలో ఓజీ ప్రీమియర్ షోలు పవన్ కళ్యాణ్ కెరీర్ లో కొత్త రికార్డులు క్రియేట్ చేసే అవకాశం ఉందని సినీ పండితులు చెబుతున్నారు. మరి ఓవర్సీస్ లో ఓజీ ఎలాంటి హిట్ అవుతుందో.. ఎంతటి వసూళ్లు సాధిస్తుందో.. ఎన్ని రికార్డులు క్రియేట్ చేస్తుందో వేచి చూడాలి.

## వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి బాలయ్య..

# ఇండియాలోనే తొలి నటుడిగా రికార్డు!


WORLD BOOK OF RECORDS
LONDON

INCLUSION LETTER

To,
Shri Nandamuri Balakrishna
Veteran Actor
Hyderabad, Telangana
India

L. No. UK/2025/75
Date : 04 August 2025

Subject : Inclusion in Gold Edition of World Book of Records, UK for Recognition of 50 Years as a Hero in Indian Cinema.

Esteemed,

World Book of Records is a leading organization in the world for registering world records. Its area of operation spans across all continents. The organization, along with world records, also provides certification and publishes information about global heritage, worldwide institutions, and prominent personalities. The organization actively engages in creative efforts towards fostering the spirit of global brotherhood, world peace, and environmental conservation.

It gives us immense pleasure to acknowledge your remarkable contribution of over 50 years as a lead hero in Indian cinema, an extraordinary achievement that has inspired millions and stands as a testament to your dedication, talent, and enduring presence in the entertainment industry.

In recognition of your unparalleled cinematic journey spanning five decades, and your continued service to society as Chairman of Basavatarakam Indo American Cancer Hospital & Research Institute for 15 years, we are honored to inform you that your name has been considered for inclusion in World Book of Records.

Your contribution to Indian cinema and public life reflects the spirit of perseverance, leadership, and cultural enrichment, aligning with the values upheld by our institution.

We congratulate you on your exceptional accomplishments and look forward to honouring your legacy through this global platform.

With warm regards and best wishes for your continued success.

Yours sincerely,
Santosh Shukla
Santosh Shukla
CEO

E : office@worldbookofrecords.uk
M : England +44 7774 94 8750
M : India +91 999 39 50000



**- అయితే వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకున్న బాలయ్యకు ఇప్పుడు సోషల్ మీడియాలో శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి**

టాలీవుడ్ సీనియర్ హీరో, నటసింహం నందమూరి బాలకృష్ణ తాజాగా అరుదైన గౌరవం దక్కించుకున్నారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (గోల్డ్ ఎడిషన్)లో చోటు సంపాదించుకున్నారు. తద్వారా ప్రత్యేకమైన మరో ఘనత ఆయన ఖాతాలో చేరింది. ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో ఆ పురస్కారానికి సెలెక్ట్ అయిన తొలి నటుడిగా నిలిచారు. బాలయ్య రీసెంట్ గా 50 ఏళ్ల సినీ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. ఇప్పటికి కూడా హీరోగా కొనసాగుతున్నారు. పలు సినిమాల్లో నటిస్తున్నారు. అయితే సినీ ఇండస్ట్రీలో 50 ఏళ్ల స్మారకమైన కెరీర్ కు గుర్తింపుగా బాలయ్యను వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సత్కరించింది. గోల్డ్ ఎడిషన్ లో వారసత్వాన్ని అమరత్వం చేసింది. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సీఈవో సంతోష్ శుక్లా అధికారికంగా బాలయ్యకు ఇన్క్లూజన్ లెటర్ జారీ చేశారు. లక్షలాది మందికి ప్రేరణగా నిలిచిన బాలకృష్ణ ఐదు దశాబ్దాల సుదీర్ఘ ప్రయాణాన్ని ప్రశంసించారు. అయితే వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో బాలకృష్ణ పేరును తాజాగా చేర్చడం ద్వారా W B R తమ లక్ష్యాన్ని బలోపేతం చేస్తుంది. అయితే వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం సంపాదించుకున్న బాలయ్యకు ఇప్పుడు సోషల్ మీడియాలో శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. సినీ సెలబ్రిటీలు, కుటుంబ సభ్యులు, అభిమానులు, సినీ ప్రియులు బెస్ట్ విషెస్ చెబుతున్నారు. శభాష్ అంటూ కొనియాడుతున్నారు. ఆగస్టు 30న హైదరాబాద్‌లో సత్కారం జరగనుంది. కాగా.. సినిమా ఇండస్ట్రీకి చేసిన సేవలకు గాను కొన్ని నెలల క్రితం కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారాన్ని అందించిన విషయం తెలిసిందే. ఇటీవల బాలయ్య దాన్ని స్వీకరించారు. ఆ తర్వాత కొన్ని రోజుల క్రితం అనౌన్స్ చేసిన 71వ జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో టాలీవుడ్ నుంచి బెస్ట్ మూవీ అవార్డుకు బాలకృష్ణ భగవంత్ కేసరి ఎంపికైంది. ఇప్పుడు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో ఆయనకు చోటు దక్కడంపై ఫ్యాన్స్, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## స్పాన్సర్ లేకుండానే

# ఆసియా కప్‌లో టీమిండియా



ఏ ముహూర్తాన ఆసియా కప్ (టి20 ఫార్మాట్) ఖరారైందో కానీ.. అన్నీ ఇబ్బందికర పరిణామాలే. ఒకటి పోతే ఒకటి అన్నట్లు వరుసగా వెంటాడుతున్నాయి. అసలు ఈ టోర్నీ నిర్వహణ భారత్‌లో జరగాలి. ఆతిథ్య హక్కులు మనదగ్గరే ఉన్నాయి. కానీ, పెహల్గాంలో ఈ ఏడాది ఏప్రిల్‌లో పాకిస్థాన్ మద్దతు ఉన్న ఉగ్రవాదులు అమాయక పర్యటకులను చంపడంతో పరిస్థితులు మారిపోయాయి. అనంతరం భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టి పాక్ ఉగ్రమూకలకు గట్టిగా బదులిచ్చింది. ఇక పాకిస్థాన్‌తో ఐసీసీ టోర్నీల్లో అదీ నాకౌట్ నుంచి మాత్రమే మ్యాచ్‌లు ఆడతామని చెప్పింది బీసీసీఐ. భారత్ ఇప్పుడు ఐసీసీ టోర్నీ కానప్పటికీ ఆసియా కప్‌లో లీగ్ దశలోనే తలపడుతోంది. ఇది తీవ్ర విమర్శలకు తావిస్తోంది. అన్నిటికి మించి ఈ టోర్నీ జరగబోయేది తటస్థ వేదిక దుబాయ్‌లో అన్నది గుర్తుంచుకోవాలి. మరోవైపు ఆసియా కప్ కోసం ఇప్పటికే టీమ్ ఇండియాను ప్రకటించగా.. అందులో టెస్టు కెప్టెన్ శుభ్‌మనగిల్‌కు చోటిస్తూ వైస్ కెప్టెన్సీ కట్టబెట్టారు. మిడిలార్డర్ బ్యాట్స్‌మన్, ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో మంచి రికార్డున్న శ్రేయస్ అయ్యర్‌ను పక్కనపెట్టారు. దీంతో బీసీసీఐపై విమర్శలు మొదలయ్యాయి.ఆ ఆలోచనే లేదు.. తేల్చేసిన బీసీసీఐ కొత్త సమస్య... భారత ప్రభుత్వం ఆన్‌లైన్ గేమింగ్ బిల్లును తీసుకొచ్చింది. దీనిప్రకారం క్రికెట్‌కు సంబంధించిన గేమింగ్ యాప్ డ్రీమ్ 11పై నిషేధం వేటు పడనుంది. వాస్తవానికి డ్రీమ్ భారత్‌లో చాలా పాపులర్. కానీ, కేంద్రం కొత్త చట్టం కొరడా ఝుళిపించడంతో బ్యాన్ పడింది. అంతేకాదు.. డ్రీమ్11 టీమ్ ఇండియాకు స్పాన్సర్. ఆటగాళ్ల జెర్సీలపై ముందుభాగంలోనే దీని పేరు ఉంటుంది. మరి బ్యాన్ నేపథ్యంలో ఏం చేయాలి? అనేది చర్చనీయంగా మారింది. ముందుగానే ఒప్పందం ఉంది కాబట్టి ఆసియా కప్‌లోనూ డ్రీమ్ 11 స్పాన్సర్ కొనసాతుందా? లేక కేంద్రం నిర్ణయం అమల్లోకి వచ్చినందున ఆటగాళ్ల జెర్సీలపై నుంచి పేరు తొలగిస్తారా? అన్న ప్రశ్నలు వచ్చాయి. బీసీసీఐ ఏం చెప్పిందంటే..? కేంద్ర చట్టం నేపథ్యంలో.. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పందించారు. అనుమతి లేని ఎలాంటి స్పాన్సర్‌ను కొనసాగించబోమని తేల్చి చెప్పారు. కేంద్రం నిర్ణయాన్ని పాటిస్తామన్నారు. మరి.. ఈ లెక్కన సెప్టెంబరు 9 నుంచి మొదలయ్యే ఆసియా కప్‌లో టీమ్‌ఇండియా స్పాన్సర్ లోగో లేకుండానే ఆడాల్స ఉంటుంది.

# క్రికెట్‌కు పుజారా గుడ్‌బై

## -అన్ని ఫార్మాట్లకు రిటైర్మెంట్
## - 103 టెస్ట్‌ల్లో 7,195 పరుగులు సాధించిన 'నయావాల్'



స్పోర్ట్స్ డెస్క్ : టీమిండియా టెస్ట్ క్రికెట్‌లో 'నయావాల్'గా నిలిచిన ఛతేశ్వర్ పుజారా క్రికెట్‌లోని అన్నిఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటించాడు. ముగ్గురు ఆటగాళ్లు ఒక్కో తరానికి 'వాల్'గా నిలబడిపోయారు. మొదటిగా సునీల్ గావస్కర్ పేరు ప్రస్తావించాల్సిందే. ఆ తర్వాత ది వాల్ అంటూ రాహుల్ ద్రవిడ్ వచ్చాడు. అతడు ఆటకు వీడ్కోలు పలికేటప్పుడు.. మరి ఈ పాత్రను పోషించే ప్లేయర్ ఎవరా? అని అనుకుంటున్న సందర్భంలో ముందుకొచ్చాడు ఛతేశ్వర్ పుజారా– నయావాల్‌గా మారిపోయి వందకు పైగా టెస్ట్ మ్యాచ్‌లు ఆడాడు. ఇప్పుడు అతడు కూడా క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్లకు రిటర్మెంట్ ప్రకటించాడు. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆయన సోషల్ మీడియాలో పోస్ట్‌ను షేర్ చేశారు. పూజారా 2023 నుంచి జట్టుకు దూరంగా ఉన్న విషయం తెలిసిందే. ఫామ్‌లోకి వచ్చేందుకు అయితే కొన్ని నెలలుగా అతను చేస్తున్న ప్రయత్నాలు ఫలించలేదు. ఈ నేపథ్యంలో పుజారా క్రికెట్‌కు పూర్తిగా వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నాడు. 2008లో టీమిండియాలోకి అడుగుపెట్టిన పుజారా చివరిసారిగా 2023 జూన్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్‌లో ఆడాడు. క్లాసికల్ టెక్నిక్, డిఫెన్స్‌కు పేరుగాంచిన పుజారా.. 15 ఏళ్లకు పైగా టెస్ట్ బ్యాటింగ్ లైనప్‌లో కీలకపాత్ర పోషించాడు. అతడి కెరీర్‌లో ఇప్పటిదాకా 103 టెస్ట్ మ్యాచ్‌లు ఆడగా.. 43.60 సగటుతో మొత్తం 7,195 పరుగులు చేశాడు. ఇందులో 19 సెంచరీలు, 35 అర్ధ సెంచరీలున్నాయి. రాహుల్ ద్రవిడ్ తర్వాత భారత మిడిలార్డర్‌కు వెన్నెముకగా నిలిచిన పుజారా.. అనేక చారిత్రాత్మక భారత విజయాల్లో తనదైన ప్రతిభను కనబరిచాడు. 2017లో రాంచీ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో పుజారా డబుల్ సెంచరీ సాధించాడు. ఈ మ్యాచ్‌లో భారత్ మొత్తం 210 ఓవర్లు ఆడితే అందులో 87.5 ఓవర్లు పుజారానే ఆడి 202 పరుగులు చేయడం విశేషం. ఇప్పటికే ఇదే భారత రికార్డు. 'రాజ్‌కోట్ అనే చిన్న పట్టణం నుంచి పిల్లవాడిగా, నా తల్లిదండ్రులతో కలిసి, నేను స్టార్లను లక్ష్యంగా చేసుకోవడానికి బయలుదేరాను. భారత క్రికెట్ జట్టులో భాగం కావాలని కలలు కన్నాను. ఈ ఆట నాకు చాలా ఇచ్చింది. అమూల్యమైన అవకాశాలు, అనుభవాలు, ప్రేమ, అన్నింటికంటే ముఖ్యంగా నా రాష్ట్రాన్ని ఈ గొప్ప దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం ఇచ్చింది. భారత జెర్సీ ధరించడం, భారత గీతం పాడటం నేను మైదానంలోకి అడుగుపెట్టిన ప్రతిసారీ నా వంతు ప్రయత్నం చేయడం దాని నిజమైన అర్థాన్ని మాటల్లో చెప్పడం అసాధ్యం. కానీ ప్రస్తుతం నేను అపారమైన కృతజ్ఞతతో అన్ని రకాల భారత క్రికెట్ నుంచి రిటైర్ కావాలని నిర్ణయించుకున్నాను".. అని పూజారా పేర్కొన్నాడు.

# జిల్లాల పర్యటనకు జనసేనాని

**విశాఖపట్టణం-సూర్య వాస్తవం:** జనసేన పార్టీ ఈ నెల 30వ తేదీన విశాఖపట్నంలో పార్టీ కార్యకర్తల సమావేశం పెడుతుంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ సమావేశానికి హాజరవుతారు. అయితే విశాఖపట్నం నుంచి ఇక కార్యకర్తల్లో జోష్ నింపేందుకు పవన్ కల్యాణ్ సిద్ధమయినట్లు కనిపిస్తుంది. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాలతో పాటు కూటమిపైన తన పట్టు నిలుపుకునే ప్రయత్నంలో భాగంగానే ఆయన వరసగా కార్యకర్తల సమావేశాలు పెట్టాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది పూర్తయిన తర్వాత సరైన పదవులు రాకపోవడంతో పాటు, కూటమిలోని ఇతర పార్టీల నేతల నుంచి సహకారం అందడం లేదని కార్యకర్తలు కొంత అసంతృప్తితో ఉన్నారు.. ఈ సమయంలో క్యాడర్ లో జోష్ నింపేందుకు పవన్ కల్యాణ్ జిల్లాల పర్యటనలు పెట్టుకున్నట్లు తెలిసింది. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు కూడా జరగనున్నాయి. వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈసారి ఎక్కువ స్థానాల్లో పోటీ చేసేందుకు పవన్ కల్యాణ్ కార్యకర్తలను



ముందుగా ప్రిపేర్ చేయడానికి ఈ కార్యక్రమం భుజానకెత్తుకున్నట్లు తెలిసింది. ప్రతి జిల్లాలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి వారికి సరైన భరోసా ఇవ్వడంతో పాటు భవిష్యత్ లో తన ప్రణాళిక ఏంటన్నది కూడా పవన్ వివరించే అవకాశముందని తెలుస్తుంది. దీనివల్ల పార్టీకి, క్యాడర్ కు మధ్య ఉన్న గ్యాప్ తొలిగిపోతుందని ఆయన భావిస్తున్నారు. ఎమ్మెల్యేలకు, కొందరు మంత్రులకు వార్నింగ్ ఎందుకు సర్దుకు పోతున్నానని... నిజానికి వచ్చే నెల నుంచి పవన్ కల్యాణ్ జిల్లాల పర్యటన చేయాలని నిర్ణయించారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం చేయడానికి జిల్లాల పర్యటనను సెప్టంబరు నుంచి చేస్తానని ఇటీవల మీడియాకు తెలిపారు. అందులో భాగంగానే ఈ నెలాఖరులోనే ఆయన విశాఖ జిల్లా కార్యకర్తల సమావేశానికి హాజరు కానున్నారు.

కూటమి ప్రభుత్వంలో పవన్ కల్యాణ్ ఇప్పటికే సర్దుకుపోతున్నారన్న అభిప్రాయం కలిగింది. అయితే తాను ఎందుకు సర్దుకుపోతున్నానో కార్యకర్తలకు వివరించే అవకాశముంది. అలాగే జిల్లాలో టీడీపీ నేతలు సహరించకపోతే పార్టీ నాయకత్వానికి తెలియచేయడానికి ఒక నాయకుడిని కూడా నియమించే ఆలోచనను పవన్ కల్యాణ్ చేస్తున్నట్లు సమాచారం. మొత్తం మీద పవన్ కల్యాణ్ జిల్లాల పర్యటన విశాఖ తో ప్రారంభ మయినట్లేనని అంటున్నారు.

# డ్రోన్లతో ఆటకట్టిస్తున్నారు...




**విశాఖపట్టణం-సూర్య వాస్తవం:**ఏపీ పోలీసులు దూకుడుగా వ్యవహరిస్తున్నారు. కేసులను ఛేదించడంలో టెక్నాలజీని వాడుకుంటున్నారు. ముఖ్యంగా డ్రోన్ల సహకారంతో నేరస్తుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నారు. డ్రగ్స్, గంజాయి సహా పలు నేరాలను అరికట్టడానికి పోలీసులు డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. డ్రోన్లతో నేరాలు సైతం తగ్గుముఖం పడుతుండడం విశేషం. తాజాగా చిత్తూరు జిల్లాలో పోలీసులు డ్రోన్ల సాయంతో అంతర్ జిల్లా జూద ముఠా ఆట కట్టించారు. పొదల్లో పేకాట ఆడుతున్న వారిని డ్రోన్ల సాయంతో పట్టుకున్నారు. వారి నుంచి భారీగా నగదు, సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. చిత్తూరు జిల్లా ముసలి పేడు పొలాల్లో గుంపుగా కొంతమంది పేకాట ఆడుతున్నారు. దీనిపై సమాచారం రావడంతో పదిమంది పోలీసులు డ్రోన్ల సాయంతో వెతుకులాట ప్రారంభించారు. ఓ పొలం సమీపంలోని పొదల్లో ఎవరికీ కనిపించకుండా వారు పేకాట ఆడుతున్నారు. ఆ లోపలికి వెళ్లిన డ్రోన్.. అక్కడ పదుల సంఖ్యలో మనుషులు పేకాట ఆడుతున్నట్లు గుర్తించింది. పోలీసులకు సమాచారం రావడంతో ఆ పొదల్లోకి వెళ్లి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. తిరుపతికి చెందిన ఇద్దరు, కడప జిల్లాకు చెందిన ఐదుగురు, రాజంపేటకు చెందిన ఇద్దరు, మరో ఇద్దరు స్థానికులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2,36,740 నగదు తో పాటు 12 సెల్ ఫోన్లు, నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. మరో 9 మంది పరారీలో ఉండడంతో వారి కోసం గాలిస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసుల చేతికి డ్రోన్ వచ్చింది. డ్రోన్ టెక్నాలజీని వాడుకొని నేరాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను పోలీసులు అరికడుతున్నారు. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో నిఘా పెంచారు. దొంగతనాలు, గంజాయి వినియోగం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రదేశాలను డ్రోన్ల ద్వారా గుర్తిస్తున్నారు. డ్రోన్ల సాయంతో పోలీసులు నేరాలను నియంత్రిస్తున్నారు. ఊరికి దూరంగా ఉండే ఖాళీ స్థలాలు, శిధిల భవనాల్లో గంజాయి తాగుతున్న వారిని పట్టుకుంటున్నారు. బహిరంగంగా మద్యం తాగే వారిని, అసాంఘిక శక్తులు గుమిగూ డే ప్రాంతాలను సైతం గుర్తించి వేగంగా అక్కడకు చేరుకుంటున్నారు. వారిని అదుపులోకి తీసుకో గలుగుతున్నారు. విశాఖ జిల్లాలో మన్య ప్రాంతంలో విపరీతంగా గంజాయి సాగు అవుతోంది. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడుతున్న దాని మూలాలు విశాఖను చూపిస్తున్నాయి. దీంతో డ్రోన్ల సాయంతో గంజాయి సాగుపై దృష్టి పెట్టారు పోలీసులు.

మన్య ప్రాంతంలో గంజాయి సాగుతున్న ప్రాంతాలను గుర్తించి దహనం చేస్తున్నారు. అప్పటినుంచి పోలీస్ శాఖలో డ్రోన్ల వినియోగాన్ని మరింత పెంచాలని నిర్ణయించారు. జిల్లాల్లో ప్రధాన పోలీస్ స్టేషన్లకు ఇప్పటికే డ్రోన్లు అందించారు. మిగతా పోలీస్ స్టేషన్లకు సైతం అందించనున్నారు. జాతరలతో పాటు పండగ సమయాల్లో కూడా డ్రోన్లు ఎగురవేసి నిరంతర నిఘ పెడుతున్నారు. కోడిపందాలు, జూద మాటలు లేకుండా నియంత్రిస్తున్నారు.

# ఎన్డీయేకు జగన్ మద్దతు

**విజయవాడ-సూర్య వాస్తవం:** రాజకీయాల్లో ప్రత్యర్థి ఎవరో తెలుసుకోకపోతే మొదటికే మోసం వస్తుంది. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు తన ప్రత్యర్థి ఎవరో తేల్చుకోలేకపోతున్నారు. ఏపీలో అధికారంలో ఉన్న కూటమికి ఢిల్లీలో మద్దతు పలికారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో తాము బీజేపీ అభ్యర్థికే మద్దతు ఇస్తామని ఆ పార్టీ నేత బొత్స సత్యనారాయణ ప్రకటించారు. నెంబర్ గేమ్ ఉండొద్దన్నది తమ విధానమని అందుకే గతంలో ప్రణబ్ ముఖర్జీకి కూడా





మద్దతిచ్చామని ఇప్పుడు బీజేపీకి మద్దతిస్తామని ప్రకటించారు. బొత్స ప్రకటన వైసీపీ వర్గాలను సైతం తీవ్రంగా నిరాశపరిచిందని చెప్పుకోవచ్చు. గత ఎన్నికల్లో జగన్ ఎవరి చేతిలో ఓడిపోయారు ?. ఎన్డీఏ చేతిలో ఓడిపోయారు. బీజేపీ నేతలు రాష్ట్రానికి వచ్చి జగన్ పై తీవ్ర విమర్శలు చేశారు. అవినీతి ఆరోపణలు చేశారు. చివరికి మూడు పార్టీల కూటమి ఆయనకు ప్రతిపక్ష నేత హోదా కూడా లేకుండా ఓడించింది. అయినా ఇప్పుడు ఎన్డీఏకే ఢిల్లీలో మద్దతు ప్రకటించారు. పోనీ ఇప్పుడు కాకపోతే తర్వాత అయినా బీజేపీతో పొత్తులు పెట్టుకునే అవకాశాలు ఉన్నాయా అంటే అలాంటి చాన్సే లేదని రాజకీయ సమీకరణాలను బట్టి అర్థం చేసుకోవచ్చు. జగన్ మోహన్ రెడ్డి ఓటు బ్యాంకు దళితులు, ముస్లింలు.. అంటే పూర్తిగా కాంగ్రెస్ ఓటు బ్యాంక్. ఆయన బీజేపీతో పొత్తులు పెట్టుకున్న మరుక్షణం ఆయన ఓటు బ్యాంక్ ఆయనకు దూరమైపోతుంది. అది రాజకీయంగా ఆత్మహత్యాసదృశం అవుతుంది. అందుకే గత ఎన్నికలకు ముందు బీజేపీతో పొత్తులు పెట్టుకోకుండా ఉండేందుకు జగన్ ఎన్ని ప్రయత్నాలు చేసినా బీజేపీ పట్టించుకోలేదని చెబుతారు. ఎప్పుడూ పొత్తులు పెట్టుకోలేనప్పుడు.. ఇప్పుడు మద్దతు ఇవ్వడం ఎందుకన్న ప్రశ్న సహజంగానే వస్తుంది. జగన్మోహన్ రెడ్డి తీవ్రమైన అవినీతి ఆరోపణల్లో ఇరుక్కున్నారు. ఆయనపై ఉన్న సీబీఐ కేసులకు తోడు లిక్కర్ స్కాం సహా పలు కేసులు మెడకు చుట్టుకునే అవకాశాలు ఉన్నాయి.

వివేకానందరెడ్డి హత్య కేసులో తదుపరి దర్యాప్తునకు సుప్రీంకోర్టు అనుమతి ఇస్తే..అది కూడా ఆయనకు చిక్కులు తెచ్చి పెడుతుదంని చెబుతున్నారు. ఇలాంటి సమయంలో ఆయన బీజేపీకి మద్దతు పలకడం.. పూర్తిగా భయంతోనేనని.. కేసుల భయంతోనేనని ప్రజలు అనుకునే పరిస్థితి ఏర్పడింది. ఎంత ప్రాంతీయ పార్టీ అయినా జాతీయ స్థాయిలో ఓ వ్యూహం ఉండాలి. గత ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత జగన్ తమ పార్టీ వారిపై దాడులు జరుగుతున్నాయని ఢిల్లీలో ధర్నా చేశారు. ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీ తప్ప ఇండీ కూటమి నేతలంతా వచ్చి సపోర్టు చేశారు. ఇక జగన్ తమ కూటమితో కలిసి వస్తారని వారు అనుకున్నారు. కానీ జగన్ మాత్రం వారి నమ్మకాన్ని వమ్ము చేశారు. తమను ఓడించిన బీజేపీకే మద్దతుగా ఉండటంతో ఇక వారు జగన్ ను పట్టించుకునే పరిస్థితి లేదు. ఇప్పుడు జగన్ ఢిల్లీకి వెళ్లి ఏపీలో ఏదో జరుగుతోందని చెప్పుకుందామన్నా ఎవరూ వినేవారు లేరు. ప్రచారం జరుగుతున్నట్లుగా లిక్కర్ స్కాంలో ఆయనను అరెస్టు చేస్తే.. ఖండించేందుకు ఒక్క జాతీయ స్థాయి నాయకుడు కూడా సిద్ధం కాకపోవచ్చు. జగన్ బీజేపీకి భయపడి చేస్తున్న రాజకీయాల వల్ల ఆయన పూర్తి స్థాయిలో రాజకీయంగా నష్టపోతున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది.

## టేకుల పాలెంలో మృతి చెందిన దేవర ఎద్దు

**- వేడుకగా అంతిమ వీడ్కోలుతో అంత్యక్రియలు...**





**మదనపల్లె -సూర్యా వాస్తవం, ఆగస్టు 24:**అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె మండలంలో ఓ దేవర ఎద్దు ఆదివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందింది. ఆ ఎద్దును దేవత మూర్తిగా భావించే గ్రామస్తులు చనిపోయిన మనిషికి ఎంత వైభవంగా అంత్యక్రియలు నిర్వహిస్తారో అంతకన్నా ఎక్కువగా వేడుక జరిపి, చనిపోయిన దేవర ఎద్దుకు అంత్యక్రియలు నిర్వహించారు. ఇందుకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాలు..
మదనపల్లె మండలం, టేకులపాలెం లో ఆదివారం దేవర ఎద్దు మృతి చెందింది. గ్రామస్తులు దైవంగా భావించే ఆ ఎద్దును సాధారణ మనిషి చనిపోతే ఎలా అంత్యక్రియలు నిర్వహిస్తారో అంతకు మించి గ్రామస్థులు ఆ ఎద్దుకు సాయంత్రం ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. డప్పు, పిల్లన గ్రోవి వాయిద్యాలతో ఎద్దును ఊరేగింపుగా గ్రామ పొలి మేర్లకు తరలించారు. అక్కడ ఒక గుంతను తవ్వి అందులో ఎద్దును పూడ్చి ఘనంగా అంత్యక్రియలు జరిపారు. టేకులపాలెం గ్రామ ప్రజలు ఆరాధ్య దైవంగా భావించే ఆ దేవర ఎద్దుకు చివరగా కన్నీటి వీడ్కోలు పలికారు.

## డ్రోన్ కంటికి చిక్కిన కోడి పందేలు

**-11 మంది అదుపులో -కోళ్లు, బైకులు, నగదు స్వాధీనం**

**- వెదురుపట్టులో కోడి పందేల అడ్డా ఛేదన : ఎస్ఐ అజయ్‌కుమార్ దాడులు**



**పెళ్లకూరు- సూర్య వాస్తవం, ఆగస్టు 24:**వెదురుపట్టు గ్రామ సమీపంలో ఆదివారం పోలీసులు అక్రమ కోడి పందేల స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఎస్ఐ అజయ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి డ్రోన్ కెమెరా సహాయంతో ఆ ప్రదేశాన్ని గుర్తించి దాడి చేశారు. ఈ చర్యల్లో లి11 మందిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి లిలి4 కోళ్లు, 8 మోటార్ బైకులు, రూ.20,100 నగదులి స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులు తిరుపతి జిల్లా ఎస్పీ, నాయుడుపేట డీఎస్పీ ఆదేశాల మేరకు, నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగాయని ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపారు. కోడి పందేల వంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## అబద్ధపు ప్రచారాలను ఐటీ వింగ్ సమర్థవంతంగా తిప్పికొట్టాలి

**- ఎంపీ గురుమూర్తి**

**తిరుపతి-సూర్య వాస్తవం, ఆగస్టు 24:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఐటీ వింగ్ ఢిల్లీలో నిర్వహించిన "మీట్ అండ్ గ్రీట్" కార్యక్రమంలో తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీ వేదికగా జరిగే అబద్దపు ప్రచారాలను ఢిల్లీ ఐటీ వింగ్ సమర్థవంతంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఐటీకి సృష్టికర్తలం తామే అని కొందరు ప్రచారం చేసుకొంటున్నారని, కాని వాస్తవానికి ఐటీలో లక్షలాది మందికి ఉపాధి కల్పించిన ఘనత వైఎస్ రాజశేఖర్ రెడ్డిదని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం పాలన వదిలి ప్రచారంపై దృష్టి పెట్టిందని మండిపడ్డారు. రాష్ట్రంలో అభివృద్ధి లేదు, వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతోందని పేర్కొన్నారు. తమ నాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజల గుండెల్లో కొలువై ఉన్నాడని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన మోసపు హామీల వలన ప్రజలు తాత్కాలికంగా పొరపడ్డారని, కూటమి మోసపూరిత పరిపాలన చూశాక ప్రజలు వాస్తవాన్ని గ్రహించారని గురుమూర్తి పేర్కొన్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి హాజరైన ఐటీ వింగ్ సభ్యులతో ఎంపీ ముచ్చటించారు. పార్టీ బలపరిచే క్రమంలో ఐటీ వింగ్ చేస్తున్న కృషిని ఎంపీ అభినందించారు.











PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )